# ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 23-7-2019 మంగళవారం సిటీ
రూ. 6-50. పేజీలు 16+16
సంపుటి 45 సంచిక 344
www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



పసందైన మరియు ఘుమఘుమలాడే వంటకాల కోసం

ఈనాడు ఆహా!
ప్రతి ఆదివారం





# కీర్తి చంద్రిక


ఇస్రో ఛైర్మన్ శివన్
విజయదరహాసం

## చంద్రయాన్-2లో తొలి అంకం విజయవంతం

- ఉత్కంఠభరితంగా సాగిన ప్రయోగం
- సాఫీగా ముగిసిన క్రయోజెనిక్ దశ
- ఇస్రోకు రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ సహా జాతి మొత్తం అభినందనలు
- సెప్టెంబరు 7న జాబిల్లిపై దిగనున్న ల్యాండర్

## నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ- ఎం3

చందమామ రావె.. జాబిల్లి రావే.. అంటూ తరతరాలుగా పిలుస్తున్నా రావడంలేదు కదా మామా.. ఇదిగో మేమే వస్తున్నాం నీ దగ్గరకు అంటూ బయలుదేరింది మిషన్ చంద్రయాన్ -2. యావత్ ప్రపంచం సంభ్రమాశ్చర్యాలతో కళ్లు పెద్దవి చేసుకుని చూస్తుండగా 136 కోట్లమంది భారతీయుల మనసుల్ని మోసుకుంటూ.. ఆశల్ని పేర్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది మన చంద్రయాన్.

నిశిరాత్రి వేళ నింగివైపు తొంగిచూసే నెలవంకను చూస్తుంటే ఏదో వింత అనుభూతి.. చిన్నతనం నుంచే ఆ జాబిలమ్మతో ఎన్నో ముచ్చట్లు.. భూమాత చుట్టూ నిశ్శబ్దంగా తిరుగుతుండే ఆ మామ గుట్టు రట్టు చేయాలని ఎన్నో ప్రయత్నాలు! చందమామ చెక్కిలి మీటాలని ఎంతో ఉబలాటం! తొలిసారిగా దిగంతాలకు దూసుకువెళ్లిన యూరి గగారిన్ చందమామ వైపు తొంగి చూసినా.. యాభయ్యేళ్ల క్రితం నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ బృందం చందమామపై పాదం మోపి అక్కడి ఊసులెన్నో మోసుకొచ్చిన ఇన్నాళ్లకు.. నిఖిల జగతి నిబిడాశ్చర్యంతో చూస్తుండగా మరింత గట్టి ప్రయత్నంలో... గొప్ప లక్ష్యంతో దూసుకువెళ్తోంది భారత్.

పూర్తి వివరాలు, కథనాలు 5, 11, 13, 15 పేజీలలో..

### 5 అంచెల్లో చంద్రయానం..




# చింతమడకే దిక్సూచి

## రాష్ట్రమంతా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు


ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న గురువు రాఘవరెడ్డి సతీమణి మంగమ్మ

- ఇక్కడి నుంచే ఆరోగ్యసూచి ప్రారంభం
- మూడు గ్రామాల్లో ఉపాధి కోసం కుటుంబానికి రూ.10 లక్షలు
- ప్రతి కుటుంబానికి లబ్ధి జరిగేలా రూ.200 కోట్లు
- హరీశ్ నాయకత్వంలో మెరుగ్గా సిద్దిపేట నియోజకవర్గం
- స్వగ్రామంలో ఆత్మీయ అనురాగ సమ్మేళనంలో సీఎం కేసీఆర్ 6లో

‘చింతమడకతో పాటు మాచాపూర్, సీతారాంపల్లి గ్రామాల్లోని 2 వేల కుటుంబాలకు ఉపాధి చూపేలా రూ.200 కోట్లు మంజూరు చేస్తున్నా. ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల విలువైన ఆస్తులు అందించనున్నాం.’

కాళేశ్వరం గంగ దూకుతోంది. ఏడాదిలోగానే రాష్ట్ర మంతా ఆ నీళ్లతో బతికే రోజులు రానున్నాయి. చింతమడక కూడా సమృద్ధిగా పంటలు పండే పల్లెగా మారుతుంది.’

### కొలువుల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్లు

- యాసిడ్ బాధితులకూ చోటు
- నేటి నుంచే అమలు

2లో

### ఎన్నికలకెందుకంత హడావుడి

- మున్సిపోల్స్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

3లో



# కాస్త ఆగండి...

## తీవ్ర ఉత్కంఠ మధ్య కర్ణాటక అసెంబ్లీ మళ్లీ వాయిదా

- విశ్వాస పరీక్షకు ఆపసోపాలు
- చర్చలతో పొద్దుపుచ్చిన మిత్రపక్షాలు
- రాత్రి 11.40వరకు కొనసాగిన సభ
- మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఓటింగ్‌కు స్పీకర్ నిర్ణయం
- మెట్టు దిగని అసమ్మతి నేతలు

ఈనాడు డిజిటల్, బెంగళూరు: కర్ణాటక విధాన సభలో నాలుగో రోజు కూడా నాటకీయత రక్తి కట్టింది. విశ్వాస పరీక్షపై ఓటింగ్ అంకానికి సాధ్యమైనంత వెసులుబాటు పొందడానికి మిత్రపక్షాలు తమ వ్యూహాలకు పదును పెడుతూనే ఉన్నాయి. సోమవారం ఉదయం గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైన విధానసభ రాత్రి 11.40 గంటల వరకు చర్చలు, వాయిదాలతోనే కొనసాగింది. మంగళవారం సాయంత్రం ఆరింటికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటింగ్ నిర్వహిస్తానన్న స్పీకర్ రమేష్‌కుమార్ నిర్ణయంతో అర్ధరాత్రి వేళ చివరకు వాయిదాపడింది. ఇప్పటికే రెండుసార్లు విశ్వాస పరీక్షకు సిద్ధమని ప్రకటించిన ముఖ్యమంత్రి కుమారస్వామి రోజంతా ఆ ఒక్క మాటను విస్మరిస్తూ కాలహరణం చేశారు. సభలో ఉత్కంఠను కొనసాగించారు. (మిగతా 2లో)




ఈనాడు సినిమా

'పెళ్లిచూపులు' చిత్రానికి ముందు... విజయ్ దేవరకొండని నమ్మడానికి ఒక్క నిర్మాత లేడు. కథలు చెప్పడానికి ఒక్క దర్శకుడు లేడు. ఇప్పుడు సొంతంగా సినిమాలు చేసే స్థాయికి ఎదిగాడు. తన కోసం అగ్ర దర్శకులు కూడా కథలు సిద్ధం చేసుకునేంత స్టార్‌డమ్ సంపాదించాడు. ఓ వ్యక్తి ఎదుగుదలకు ఇంతకంటే కొలమానం ఏముంటుంది? సినిమాల్లో చూస్తే అతని నటన నచ్చుతుంది. బయట అతని మాటలు వింటే పూర్తిగా తనే నచ్చేస్తాడు. సినిమా సినిమాకీ ఒక్కో మెట్టూ ఎక్కుతూ ముందుకు సాగిపోతున్నాడు విజయ్ దేవరకొండ. ఆయన నటించిన తాజా సినిమాని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాడు. అదే 'డియర్ కామ్రేడ్'. ఈవారమే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో విజయ్ దేవరకొండ పాత్రికేయులతో మాట్లాడారు.


విజయ్ దేవరకొండ

# అందరూ విజయ్ దేవరకొండలు కాలేరు!

**'డియర్ కామ్రేడ్' ప్రచార బాధ్యతలంతా మీరే నెత్తిమీద వేసుకున్నారు. సంగీతోత్సవం అంటూ నాలుగు భాషల్లోనూ స్టేజీ షోలు చేశారు. దీనంతటికీ కారణం ఏంటి?**

నా సినిమాకి నేనే ప్రచారం చేసుకోవాలి కదా? 'పెళ్లిచూపులు' నుంచీ అదే అలవాటైపోయింది. 'డియర్ కామ్రేడ్' రెండు మూడేళ్ల ప్రయాణం. ఈ కథ నాకు బాగా నచ్చింది. పాటలు మనసుకి హత్తుకున్నాయి. నాకు దొరికిన బెస్ట్ ఆల్బమ్ ఇది. ఇన్ని మంచి పాటలు మళ్లీ నా సినిమాలో వినిపిస్తాయో, లేదో నాకు తెలీదు. అందుకే సంగీతోత్సవం పేరుతో వేడుకలు నిర్వహించాం. ఈ సినిమా గురించి ఏదైనా చెప్పగలిగే హక్కు, అవకాశం, బాధ్యత నాకే ఉన్నాయి అనిపించింది. అందుకే అందరికంటే నేనే ఎక్కువగా మాట్లాడుతున్నానేమో..?

**నాలుగు భాషల్లో మీ సినిమాని విడుదల చేస్తున్నారు. మిగిలిన చోట్ల ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారో అన్న అనుమానాలు ఉన్నాయా?**

ముందు తెలుగు ప్రేక్షకుల కోసమే 'డియర్ కామ్రేడ్' రూపొందించాం. సగం సినిమా పూర్తయ్యాక మిగిలిన భాషల్లోనూ విడుదల చేస్తే బాగుంటుందనిపించింది. తమిళ, కన్నడ, మలయాళ పరిశ్రమలకు చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు మా సినిమాలో పనిచేశారు. 'ఇంత మంచి సినిమాని మా ప్రేక్షకులకూ చూపించాలి' అన్నది వాళ్ల ఆలోచన. మైత్రీ మూవీస్ సహకారంతో నాలుగు భాషల్లోనూ విడుదల చేయడానికి ధైర్యం చేశాం. తమిళ, కన్నడ, మలయాళంలో నేను డబ్బింగ్ చెప్పలేకపోయాను.

**తరువాతి అడుగు బాలీవుడ్ వైపేనా?**

'అర్జున్‌రెడ్డి'ని అక్కడ చేయమన్నారు. రేపు 'డియర్ కామ్రేడ్' విడుదలైన తరవాత హిందీలో చేయమని అడుగుతారు. చెప్పిన కథని నాకు మళ్లీ చెప్పడం ఇష్టం ఉండదు. మన దగ్గర చాలా కొత్త కథలున్నాయి. వాటిని జనంలోకి తీసుకెళ్లాలి. 'అర్జున్‌రెడ్డి'ని బాలీవుడ్‌లో నేనే చేస్తే.. తెలుగులో నాలుగు సినిమాలు చేసే అవకాశం కోల్పోయే వాణ్ని. మంచి కథ అనిపిస్తే తప్పకుండా బాలీవుడ్‌లో చేస్తా. కాకపోతే ఓ తెలుగు సినిమాని బాలీవుడ్‌లోనూ మాట్లాడుకునేలా తీయగలిగితే అది కదా గ్రేట్! ముందు ఆ ప్రయత్నం చేద్దాం.

**'డియర్ కామ్రేడ్' ఎలాంటి కథ? ఇందులో మీకు నచ్చిన విషయాలేంటి?**

దీన్ని ఓ జోనర్‌కి పరిమితం చేయలేం. అన్ని రకాల భావోద్వేగాలు ఉన్నాయి. బాబీ, లిల్లీ అనే ఇద్దరి ప్రయాణం ఈ కథ. కాలేజీ నేపథ్యంలో సాగుతుంది. విద్యార్థి రాజకీయాలు, ప్రేమ, విడిపోవడం, మళ్లీ కలుసుకోవడం ఇవన్నీ చూపించాం. ఇష్టమైనది పోరాడైనా దక్కించుకోవాలన్నది ఈ కథ సారాంశం. భరత్ కమ్మ కథ చెప్పగానే కనెక్ట్ అయిపోయాను. నాకు నచ్చిన విషయాలు ఇందులో చాలా ఉన్నాయి. ప్రేక్షకులకూ అవి తప్పకుండా నచ్చుతాయని నా నమ్మకం. సినిమా చూసి ఆస్వాదించడమే కాదు. ఇంటికివెళ్తూ వెళ్తూ ఓ అనుభూతిని మోసుకెళ్తారు.

### ముద్దు పెట్టుకోవడం కూడా నటనే

ముద్దు సన్నివేశాలు ఉంటేనే సినిమాలు ఆడతాయని నేనెప్పుడూ అనుకోను. అవన్నీ కథలో భాగం. ఓ పోరాట ఘట్టం తెరకెక్కిస్తున్నాం అనుకోండి. రౌడీలపై నాకేం పగ ప్రతీకారాలు ఉండవు. వాళ్లని కొట్టడం నటన మాత్రమే. ముద్దూ అంతే. తెరపై బాబీ, లిల్లీ అనే ఇద్దరు ముద్దులు పెట్టుకుంటారు. విజయ్, రష్మికలు కాదు.

**విద్యార్థి రాజకీయాల నేపథ్యంలో సాగే సినిమా ఇది. మీరు విద్యార్థిగా ఉన్నప్పుడు ఉద్యమాల్లో పాల్గొన్నారా?**

లేదు. అలాంటి వాతావరణం నాకు అస్సలు తెలీదు. డిగ్రీలో ఉన్నప్పుడు మాత్రం విద్యార్థి సంఘాల గురించి కొంత అవగాహన వచ్చింది. వాళ్లు బంద్‌కి ఎప్పుడు పిలుపునిస్తారా? అని చూసేవాణ్ని. ఆ పేరుతో క్లాసులు డుమ్మా కొట్టొచ్చు కదా..? 'డియర్ కామ్రేడ్'లో విద్యార్థి దశ ఓ భాగం మాత్రమే. సినిమా మొత్తం అదే ఉండదు. ఇందులో కమ్యునిజం భావాలూ చూపించడం లేదు. ఈ సినిమా మొదలయ్యే ముందు చెగొవేరాకు సంబంధించిన రెండు పుస్తకాలు ఇచ్చాడు దర్శకుడు. వాటిని ఎందుకు చదవమన్నాడో నాకు అర్థం కాలేదు. నేనైతే ఒక్క పేజీ కూడా తిప్పలేదు.

**మీ స్టైల్ ఈమధ్య ఓ ట్రెండ్‌గా మారింది. కొంతమంది యువ కథానాయకులు కూడా మిమ్మల్ని అనుసరించడం మొదలెట్టారు. గమనిస్తున్నారా?**

నా గెడ్డం, నా వేషాలు.. తెరపై ఇవే కనిపిస్తాయి. కానీ ఎన్ని ఆలోచనల తరవాత అవి పుట్టి ఉంటాయో ఎవ్వరికీ అర్థం కాదు. ఆలోచనల్లో నిజాయతీ ఉండాలి. అందుకు సొంత తెలివితేటలు వాడాలి. నన్ను అనుసరించినంత మాత్రాన అందరూ విజయ్‌దేవరకొండలు కాలేరు.

**స్టార్‌డమ్, ఇమేజ్ వచ్చాక కథలు ఎంచుకునే పద్ధతి ఏమైనా మారిందా?**

స్టార్‌డమ్, ఇమేజ్.. ఇవేం నమ్మను. రాత్రికి రాత్రే ఏమైనా జరగొచ్చు. కానీ ఇప్పుడు కథలు ఎంచుకోవడంలో నా ఆలోచన మారింది. ఇప్పుడు 'పెళ్లి చూపులు' లాంటి సినిమాలు చేయలేను. అంతకంటే ఎక్కువ స్పాన్ ఉన్న సినిమాలు చేసే అవకాశం దక్కింది కదా? 'పెళ్లి చూపులు' సమయంలో ఓ కథ బాగా నచ్చింది. చేద్దామనుకున్నా. కానీ ఇప్పుడు నాకు ఆ కథ కరెక్ట్ కాదు. కానీ ఆ కథపై ఇంకా నమ్మకం ఉంది. అందుకే నేను నిర్మాతగా ఆ సినిమా చేయబోతున్నా.

**పూరి, కొరటాల శివలతో సినిమా ఎప్పుడు?**

పూరి జగన్నాథ్‌గారితో సినిమా ఇంకా ఏమీ అనుకోలేదు. ఆ ఆలోచన వస్తే తప్పకుండా చెబుతాం. కొరటాల శివగారితో చేయాలని ఉంది. ఆయన ప్రస్తుతం చిరంజీవి గారితో ఓ సినిమా చేస్తున్నారు. అది పూర్తయ్యాక ఇద్దరి వీలుని బట్టి ఆలోచించాలి.

# సూర్య చెప్పినా మోదీ వింటారు

– రజనీకాంత్


హరీష్ జైరాజ్, సూర్య, కేవీ ఆనంద్, శంకర్, మోహన్‌లాల్, రజనీకాంత్, వైరముత్తు, శివకుమార్

"ప్రతి చిత్రానికి తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటారు సూర్య. ప్రేక్షకులకు కొత్త రకమైన చిత్రాలు అందించడానికి ఎంతైనా కష్టపడతారాయన. ఎలాంటి ప్రయోగాలకైనా సిద్ధపడతారు" అన్నారు రజనీకాంత్. సూర్య నటించిన తమిళ చిత్రం 'కాప్పాన్'. తెలుగులో 'బందోబస్త్'గా వస్తోంది. మోహన్‌లాల్ ముఖ్యపాత్ర పోషించారు. కేవీ ఆనంద్ తెరకెక్కించిన ఈ సినిమా ఆడియో, ట్రైలర్ విడుదల కార్యక్రమం చెన్నైలో జరిగింది. ప్రముఖ కథానాయకుడు రజనీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై పాటలను విడుదల చేశారు. అనంతరం రజనీకాంత్ మాట్లాడుతూ "సూర్య పట్టుదలతో ఈ స్థాయికి ఎదిగారు. 'నేరుక్కునేర్' సినిమాలో ఆయన్ని చూసినప్పుడు ఇతను రాణించగలడా..? అని అనుకున్నా. ఆ తర్వాత 'నందా', 'పితామగన్' చిత్రాల్లో మెరుపులు మెరిపించారు. ఇప్పుడు ఉన్నతమైన నటుడిగా ఎదిగారు. తనను తానే తీర్చిదిద్దుకొని ఈ స్థాయికి చేరుకున్నారు. సూర్య, కార్తిలను శివకుమార్ ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఇటీవల నూతన విద్యా విధానం గురించి సూర్య చెప్పిన అభిప్రాయం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై నేను మాట్లాడితే మోదీ తప్పకుండా వింటారని ఇక్కడ వేదికపై మాట్లాడిన వక్తలు చెప్పారు. సూర్య మాట్లాడినా ప్రధాని మోదీ వింటారు. సూర్య అభిప్రాయానికి నేను మద్దతిస్తున్నా. అగరం ఫౌండేషన్ ద్వారా ఆయన చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. విద్యార్థుల కష్టాలను నేరుగా చూసిన అనుభవం ఆయనకు ఉంది. భవిష్యత్తులో ఆయన సేవలు దేశానికి చాలా అవసరం. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్‌ల కలబోత హారిస్ జయరాజ్. ఆయన సంగీతంలోని 'వశీగరా..' పాటకు నేను పెద్ద అభిమానిని. వైరముత్తు రాసిన 'తమిళాట్రుపడై'ని చదివా. భాష అంతరిస్తే, ఆ జాతే అంతరించిపోతుందని అందులో ప్రస్తావించారు. శివకుమార్‌తో 'కవికుయిల్', 'భువనా ఒరు కేళ్వికురి' చిత్రాల్లో నటించా. షూటింగ్ స్పాట్‌లో ఏ నటితోనూ, అమ్మాయితోనూ ఆయన మాట్లాడనివ్వరు. ఏదైనా పుస్తకమిచ్చి చదవమని చెబుతారు"అన్నారు. మోహన్‌లాల్ మాట్లాడుతూ 'సూర్యలాగా చిత్ర పరిశ్రమపై అంకితభావమున్న నటుడిని నా 40 ఏళ్ల సినీ జీవితంలో చూడలేదు. ఈ చిత్రంలో నా కుమారుడిగా ఆర్య నటించారు. షూటింగ్ కారణంగా ఈమధ్య జరిగిన ఆయన పెళ్లికి నేను హాజరు కాలేకపోయాను" అన్నారు. ఈ సందర్భంగా మోహన్‌లాల్‌కు రజనీకాంత్ ఓ జ్ఞాపిక అందజేశారు. రజనీకాంత్ ఈ కార్యక్రమానికి హాజరుకావడం చాలా ఆనందంగా ఉందని సూర్య చెప్పారు. జాతీయ విద్యా విధానం విషయంలో సూర్య అభిప్రాయంపై మీ స్పందన ఏంటని దర్శకుడు శంకర్‌ను పాత్రికేయులు ప్రశ్నించగా... ఆయన ఏమి మాట్లాడారో నాకు తెలియదని సమాధానం దాట వేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, వైరముత్తు, ఆర్య, హారిస్ జైరాజ్, కేవీ ఆనంద్, కార్తి, సాయేషా సైగల్ తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కోడంబాక్కం


రవితేజ

# దిల్లీ వెళ్తున్న 'డిస్కో రాజా'

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డిస్కోరాజా'. పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్ కథానాయికలు. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. రవితేజ, వెన్నెల కిషోర్, శశిర్ షరమ్, టోనిహోప్‌లపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఆగస్టు తొలి వారంలో చిత్రబృందం దిల్లీ వెళ్లనుంది. అక్కడ రవితేజ, నభా నటేష్‌పై సన్నివేశాల్ని తెరకెక్కిస్తారు. నిర్మాత మాట్లాడుతూ "హైదరాబాద్‌లో రూ.1.2 కోట్ల వ్యయంతో ఓ సెట్‌ని తీర్చిదిద్దాం. అక్కడ తీసిన సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. తెరపై ఆ సెట్‌ని చూసి ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు. ఈనెల 26 వరకూ హైదరాబాద్‌లోనే చిత్రీకరణ జరుపుతామ"న్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సాయి శ్రీరామ్.


ప్రముఖ గాయని స్మిత సంగీత ప్రయాణం మొదలై 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 'స్మిత ఎ జర్నీ 1999– 2019' పేరుతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అల్లరి నరేష్, జగపతిబాబు, నాగార్జున, స్మిత, నాని, నవదీప్, కీరవాణి

# అమలా పాల్ పారితోషికం వెనక్కిచ్చింది


తమ్మారెడ్డి భరద్వాజ

"మంచి సినిమాని తీయడమే కాదు, దాన్ని సరిగ్గా విడుదల చేసుకోవాలి. లేకపోతే నిర్మాతలు నష్టపోతారు" న్నారు ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ఆయన ఇటీవల 'ఆమె' చిత్రాన్ని తెలుగులో విడుదల చేశారు. అమలాపాల్ ప్రధాన పాత్రధారిగా నటించింది. తమిళంలో 'ఆడై'గా తెరకెక్కింది. "రెండు భాషల్లోనూ 'ఆమె' మంచి సినిమా అనే ప్రశంస పొందింది. కానీ వసూళ్లే రాలేదు" అంటున్నారు తమ్మారెడ్డి భరద్వాజ. ఆయన సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "ప్రతి అమ్మాయి, వాళ్ల తల్లిదండ్రులు చూడాల్సిన సినిమా 'ఆమె'. అమలాపాల్ సాహసోపేతంగా నటించింది. ద్వితీయార్థం అంతా నగ్నంగానే కనిపిస్తుంది. కానీ దర్శకుడు అసభ్యత లేకుండా తీర్చిదిద్దాడు. విడుదల ఆలస్యం కావడంతో ఫలితం నిరాశ పరిచింది. తమిళ నిర్మాతల వల్లే ఇది జరిగింది. అక్కడ ఫైనాన్షియర్లకి డబ్బులు చెల్లించకపోవడంతో తొలి రోజు సినిమా విడుదల కాలేదు. అప్పుడు అమలా పాల్ తన పారితోషికాన్ని వెనక్కి ఇవ్వడంతోపాటు అదనంగా డబ్బు ఇచ్చి విడుదలకి సాయం చేసింది. ఆ విషయంలో ఆమెకి హ్యాట్సాఫ్ చెప్పాలి. ఈ సినిమా విషయంలో మమ్మల్ని తమిళ నిర్మాత మోసం చేశారు. మేం ఆయనకి ఎప్పుడో డబ్బు ఇచ్చేశాం. కానీ మాకు సమయానికి సినిమాని ఇవ్వలేకపోయారు. అతనిపై ఇప్పటికే చలన చిత్ర వాణిజ్య మండలిలో ఫిర్యాదు చేశాం. త్వరలోనే కేసు పెట్టబోతున్నాం" అన్నారు.

# '22' వెనుక కథేంటి?


వెంకటేష్, శివకుమార్, రూపేష్ కుమార్, సలోని మిశ్రా, సాయిధరమ్ తేజ్

రూపేష్ కుమార్, సలోని మిశ్రా జంటగా నటిస్తున్న చిత్రం '22'. శివకుమార్ బి దర్శకుడు. మా ఆయి ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రం సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వెంకటేష్ క్లాప్‌నివ్వగా, నిర్మాతలు బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, నవీన్ ఎర్నేని, కొండా కృష్ణంరాజు కెమెరా స్విచ్చాన్ చేశారు. భీమనేని శ్రీనివాసరావు గౌరవ దర్శకత్వం వహించారు. హరీష్ శంకర్ స్క్రిప్ట్ అందించారు. సాయిధరమ్ తేజ్ అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ "ఓ మర్డర్ మిస్టరీ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. టైటిల్‌గా '22' సంఖ్యను పెట్టడం వెనుక ఓ ట్విస్ట్ ఉంది. అదేంటన్నది థియేటర్లో చూసి తెలుసుకోవాల"న్నారు. రూపేష్ మాట్లాడుతూ "నటుడవ్వాలన్న కోరిక ఈరోజు నెరవేరింది. ఇంతకు ముందు శివకుమార్ దర్శకత్వంలో ఓ వెబ్‌సిరీస్ చేశా. ఆ సమయంలోనే '22' స్క్రిప్ట్ వినిపించారు. థ్రిల్లింగ్ అనిపించింది" అన్నారు. "నా తొలి చిత్రం 'ఫలక్‌నుమాదాస్' లోని పాత్ర కన్నా భిన్నమైన పాత్రను ఇందులో చేస్తున్నా" అని చెప్పింది సలోని.

# పూరిపై ఆకాష్ ఫిర్యాదు


ఆకాష్

పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'ఇస్మార్ట్ శంకర్' ఇటీవలే విడుదలైంది. అయితే ఈ చిత్ర కథ తాను రూపొందించిన 'నాన్ యార్' అనే తమిళ చిత్రాన్ని పోలి ఉందంటున్నారు నటుడు ఆకాష్. సోమవారం ఆయన హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడారు. "నేను కథ, స్క్రీన్‌ప్లే అందించిన చిత్రం 'నాన్ యార్'. రాధ దర్శకుడు. ఈ చిత్రాన్ని తెలుగులో 'కొత్తగా ఉన్నాడు' పేరుతో అనువదించాం. త్వరలో విడుదల చేద్దామనుకుంటున్న తరుణంలో 'ఇస్మార్ట్ శంకర్' చూసి ఆశ్చర్యపోయా. నా కథకు చాలా దగ్గర పోలికలు ఉన్నాయి. ఈ విషయమై తమిళ నిర్మాతల మండలిలో పూరి జగన్నాథ్‌పై ఫిర్యాదు చేశా. సమస్య పరిష్కారం కాకపోతే న్యాయ పోరాటం చేస్తాన"న్నారు.

**తీసుకెళ్లే దేవుడి కంటే మనల్ని మోసుకెళ్లే మనుషులే ముఖ్యం.**
చిత్రం: వైశాఖం
– పంపినవారు: ముద్దుల అంజి, రామచంద్రుని పేట

పంచ్ డైలాగ్

# 'అవతార్'ను దాటేసిన 'అవెంజర్స్'


'అవెంజర్స్: ఎండ్‌గేమ్'

'అవెంజర్స్: ఎండ్‌గేమ్' ఎట్టకేలకు 'అవతార్'ను వెనక్కు నెట్టేసింది. ప్రపంచంలోనే అత్యధిక వసూళ్లందుకున్న చిత్రంగా నిలిచి కొత్త చరిత్ర లిఖించింది. 2009లో విడుదలైన 'అవతార్' అంతకు మునుపు ఏ చిత్రానికీ సాధ్యం కాని రీతిలో ప్రపంచవ్యాప్తంగా 2.78 బిలియన్ డాలర్లు వసూళ్లందుకుంది. ఇప్పుడు 'ఎండ్‌గేమ్' 2.79 బిలియన్ డాలర్లు సాధించి 'అవతార్' రికార్డును బద్దలుకొట్టింది. అయితే 'ఎండ్‌గేమ్'కు ఈ ఘనత అంత సునాయాసంగా దక్కలేదు. ఈ రికార్డు సాధించడం కోసం ఆ చిత్రాన్ని రెండోసారి కూడా విడుదల చేయాల్సి వచ్చింది. 'ఎండ్‌గేమ్'ను తొలిసారి విడుదల చేసినప్పుడు అనూహ్యమైన వసూళ్లు దక్కినా చివరకు 'అవతార్' వసూళ్ల కన్నా సుమారు 45 మిలియన్ డాలర్లు వెనకబడింది. ఎలాగైనా 'అవతార్'ను అధిగమించాలన్న లక్ష్యంతో 'ఎండ్‌గేమ్'కు కొన్ని అదనపు సన్నివేశాలు జోడించి మళ్లీ విడుదల చేశారు. దీంతో అనుకున్నట్లుగానే 'ఎండ్‌గేమ్' వసూళ్ల పరంగా 'అవతార్' కన్నా ముందు నిలిచింది. ఈ సందర్భంగా 'ఎండ్‌గేమ్' చిత్రబృందానికి అవతార్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈనాడు బిజినెస్

రాముడు లేకుండా రామాయణం లేదు.. వానరులు లేకుండా రామరావణ యుద్ధమే లేదు.. రాముడికి వారు తోడవడం వల్లే గొప్ప విజయం సిద్ధించింది..

ఇస్రో లేకుండా చంద్రయాన్-2 లేదు.. ప్రైవేటు కంపెనీలు లేకుండా ఆ ప్రయోగమే లేదు... ఇస్రోకు వాళ్లు తోడవడం వల్లే.. గొప్ప విజయం దక్కింది.

ఇప్పుడే కాదు.. అంతక్రితం ప్రయోగాల్లోనూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇస్రోకు ప్రైవేటు కంపెనీలు పొరుగు సేవలను అందిస్తూనే వచ్చాయి. ఈ సహకారం ఇప్పటిది కాదు. అణ్వాయుధ పరీక్షలు నిర్వహించామంటూ మనకు సాంకేతికతను ఇవ్వకుండా, ఇవ్వనీయకుండా కొన్ని పాశ్చాత్య శక్తులు ఆంక్షలు విధించినప్పటి నుంచీ ఆ సహకారం అందుతూనే ఉంది. అయితే ఈ సారి చందమామ గురించి మరింత కూలంకశంగా తెలుసుకోవాలన్న భారతీయుల ఆశలకు 'ప్రైవేటు' మద్దతు మరువలేనిది.

# మేము సైతం.. మామ కోసం



**చంద్రయాన్-2లో ప్రైవేటు కంపెనీల కీలక పాత్ర**

ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-2 ప్రయోగానికి ప్రైవేటు కంపెనీలూ తమ వంతు సహకారాన్ని అందించాయి. ఎల్ అండ్ టీ, గోద్రేజ్ గ్రూప్ వంటి కంపెనీలు హార్డ్‌వేర్, టెస్టింగ్ సొల్యూషన్లను అందించాయి. హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్ కూడా కీలక పాత్ర పోషించింది.

రూ.978 కోట్లతో చేపట్టిన ఈ మానవరహిత ప్రయోగంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 2:43 గంటలకు బాహుబలిగా పిలుస్తున్న వాహకనౌక(రాకెట్) నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగసింది. 16 నిమిషాల అనంతరం 3.8 టన్నుల బరువు గల చంద్రయన్-2 ఉపగ్రహాన్ని విజయవంతంగా భూకక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలోనే ఈ 'బాహుబలి' ప్రయోగం జరిగినప్పటికీ.. ప్రైవేటు కంపెనీలు సైతం తమ వంతు సహకారాన్ని అందించాయనే చెప్పాలి. పైన చెప్పిన రెండు దిగ్గజ గ్రూప్‌లతో పాటు.. అనంత్ టెక్నాలజీస్, ఎమ్‌టీఏఆర్ టెక్నాలజీస్, ఐనాక్స్ టెక్నాలజీస్, లక్ష్మీ మెషీన్ వర్క్స్, సెంట్రమ్ అవసరాల, కర్ణాటక హైబ్రిడ్ మైక్రోడివైజెస్ వంటివి కూడా ఈ విజయవంతమైన ప్రయోగంలో పాలుపంచుకున్నాయి.

## గోద్రేజ్ ఏరోస్పేస్

ఈ ప్రయోగానికి కీలమైన సామగ్రిని గోద్రేజ్ అందించింది. వాహక నౌక అయిన జీఎస్ఎల్‌వీ ఎమ్‌కే 3 కోసం ఎల్110 ఇంజిన్, సీఈ20 ఇంజిన్‌లను సమకూర్చింది. అదే సమయంలో ఆర్బిటర్, ల్యాండర్‌లకు థ్రస్టర్లను; డీఎస్ఎన్ యాంటెనాకు విడిభాగాలను కూడా అందించినట్లు గోద్రేజ్ ఏరోస్పేస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ ఎస్.ఎమ్.వైద్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎల్ అండ్ టీ డిఫెన్స్

ఇక కీలకమైన ఫ్లైట్ హార్డ్‌వేర్, సబ్‌సిస్టమ్స్, అసెంబ్లీస్‌లను అందించినట్లు ఎల్ అండ్ టీ డిఫెన్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ జేడీ పాటిల్ అన్నారు. రాకెట్‌ను మండించడానికి అవసరమైన ట్విన్ ఎస్200 సాలిడ్ బూస్టర్లు(హెడ్ ఎండ్, మిడిల్, నాజిల్ ఎండ్ విభాగాలు) ఎల్ అండ్ టీకి చెందిన పొవాయ్ ఏరోస్పేస్ వర్క్‌షాప్‌లో తయారు చేసినవే. తయారీతో పాటు.. ప్రూఫ్ ప్రెషర్ పరీక్షను సైతం ఎల్ అండ్ టీ నిర్వహించింది. ఎస్200 సాలిడ్ బూస్టర్ల తయారీ నాణ్యత పరీక్షలు ఇందులో భాగమే. ఇక అంబిలికల్, హనీ కాంబ్ డెక్ ప్యానెళ్ల వంటి హార్డ్‌వేర్ పరికరాలనూ అందించిందీ కంపెనీ. చంద్రయాన్-2కు ఉపయోగించిన తాజా జీఎస్ఎల్‌వీ ఎమ్‌కే 3తో పాటు అన్ని తరాల రాకెట్ల(ఎస్ఎల్‌వీ3, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ) పాలుపంచుకున్న ప్రయోగాల్లోనూ కంపెనీ కీలక పాత్ర పోషించినట్లు పాటిల్ పేర్కొన్నారు.

## సెయిల్

ప్రభుత్వ రంగ కంపెనీలతో పాటు ప్రభుత్వ రంగ కంపెనీ అయిన సెయిల్ సైతం తన వంతు సహకారం అందించింది. ప్రత్యేక నాణ్యతతో కూడిన స్టెయిన్‌లెస్ స్టీల్‌ను సరఫరా చేసింది.

ప్రస్తుతం భూకక్ష్యలోకి చేరిన ఉపగ్రహం.. క్రమంగా తన మార్గాన్ని చందమామ చుట్టూ పరిభ్రమించేలా మార్చుకుంటుంది. చందమామపై దిగిన ల్యాండర్ నుంచి సెప్టెంబరు 7న రోవర్‌ను చందమామ ఉపరితలంపైకి తీసుకెళ్లాలన్నది ప్రణాళికలో భాగంగా ఉంది. కాగా, యాభై ఏళ్ల కిందటే భారత్ తన దేశీయ రోదసీ ప్రయాణాలకు అంకురార్పణ చేసింది. అయితే 1974లో అణ్వాయుధ పరీక్ష నేపథ్యంలో మనపై సాంకేతిక పరిజ్ఞానాల దిగుమతిపై కొన్ని బలమైన దేశాలు ఆంక్షలు విధించాయి. దీంతో దేశీయంగా సాంకేతికత, రాకెట్‌లను అభివృద్ధి చేసుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచీ ఇస్రో దిగుమతి వ్యయాలను తగ్గించుకుంటూ వచ్చింది. అందులో భాగంగానే ప్రైవేటు కంపెనీల నుంచి కూడా పొరుగు సేవలను పొందుతూ వస్తోంది.



'ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరినొకరు ఆలింగనం చేసుకోవడాన్ని చూసేందుకు ఊపిరి బిగబట్టి ఎదురుచూశాను. మన శాస్త్రవేత్తలకు నిలబడి నేను సెల్యూట్ చేస్తున్నా. ఇప్పుడు మన కొత్త సెలబ్రిటీలు వారే. చంద్రయాన్-2 ప్రయోగం మన క్రయోజెనిక్ సాంకేతిక బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. అంతేకాదు, ఇది సాంకేతికంగా ఓ మేలిమలుపు. భవిష్యత్తులో మరిన్ని చంద్ర మిషన్‌లు తయారు చేయడానికి ఇది దోహదం చేస్తుంది'.

**- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు ఛైర్మన్**



'చంద్రయాన్-2.. అంతరిక్ష శాస్త్రంలో (స్పేస్ సైన్స్) మన దేశ స్థాయిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. ఇస్రోలో పని చేస్తున్న శాస్త్రవేత్తల్ని చూస్తోంటే చాలా గర్వంగా ఉంది. అందులోనూ మహిళలు ఎక్కువగా ఉన్నారు. సైన్స్‌లో పెట్టుబడులు పెట్టడమంటే మన భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడమే'.

**- కిరణ్ మజుందార్ షా, బయోకాన్ ఛైర్‌పర్సన్**

## అనంత్ ఘనత



హైదరాబాద్‌కు చెందిన అనంత్ టెక్నాలజీస్(ఏటీఎల్) రెండున్నర దశాబ్దాలకు పైగా ఇస్రో కార్యకలాపాల్లో కీలకమైన పాత్ర పోషిస్తోంది. తన తిరువనంతపురం ప్లాంటు ద్వారా వాహక నౌకలైన పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీలకు ఏవియానిక్స్ వ్యవస్థలను సరఫరా చేస్తోంది. అన్ని రకాల ఉపగ్రహాలకు కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, నేవిగేషనల్ వంటి ఎలక్ట్రానిక్ ఉపవ్యవస్థలను అందించింది. ఇస్రోకు చెందిన పలు విజయవంతమైన ఉపగ్రహ ప్రయోగాలకు టెలీమెట్రీ, టెలీకమాండ్, పవర్, ఆటిట్యూడ్, ఆర్బిట్ కంట్రోల్, ఆన్-బోర్డ్ కంప్యూటర్ వంటి రోదసీ వ్యవస్థలు, సామగ్రిని సరఫరా చేసింది. వీటన్నిటిలో కంటే కీలకమైన 'స్టార్ సెన్సార్'ను సైతం ఏటీఎల్ సరఫరా చేసింది. నక్షత్రాల ఆధారంగా ఉపగ్రహ కదలికలను పసిగట్టే ఈ సెన్సార్ అత్యంత కీలకమైనది. ఇంకా నేవిగేషన్, గైడెన్స్, కంట్రోల్, అధునాతన టెలీమెట్రీ వ్యవస్థలు, ఆర్ఎఫ్ సిస్టమ్స్, పవర్ మాడ్యూల్స్, డీసీ/డీసీ కన్వర్టర్లు తదితర ఏవియానిక్స్ వ్యవస్థలనూ విజయవంతంగా ఇవ్వగలిగింది. ఇక చంద్రయాన్ 2 విషయానికొస్తే.. ఇందులో ఉండే మూడు ప్రధాన భాగాల(రాకెట్, ఆర్బిటర్, ల్యాండర్)కూ ఏవియానిక్స్ వ్యవస్థలను తయారు చేసి, సరఫరా చేసింది. ల్యాండర్, ఆర్బిటర్(ఉపగ్రహం)లను మండించే పేలోడ్లలోని ఎలక్ట్రానిక్ వ్యవస్థనూ ఏటీఎల్ తయారు చేసింది. దాదాపు 300 మంది సుశిక్షితులైన సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు ఏటీఎల్‌లోని స్పేస్ సిస్టమ్స్ కోసం పనిచేస్తున్నారు. ఇస్రో పాటించే కఠిన ప్రమాణాలకు అనుగుణంగా కంపెనీ వివిధ పరికరాలను రూపొందిస్తోంది. కంపెనీకి చెందిన అసెంబ్లీ, టెస్ట్ ప్లాంట్లకు ఇస్రో ధ్రువీకరణ పత్రం కూడా లభించింది.



# మాల్యా ఆస్తుల యాజమాన్య వివరాలివ్వండి

**బ్రిటన్ కోర్టులో భారతీయ బ్యాంకుల విజయం**

లండన్: గేమ్ రిజర్వ్, రెండు సూపర్‌యాచ్‌లు, విలువ కట్టలేని వింటేజ్ కార్లు, విలువైన చిత్రాలు, సుప్రసిద్ధ ఎల్టన్ జాన్ వినియోగించిన పియానో.. వంటి అత్యంత ఖరీదైన ఆస్తులు విజయ్ మాల్యా ఆధీనంలో ఉన్నాయి. అయితే అవి మాల్యాకే చెందినవని నిరూపించే ధ్రువీకరణ పత్రాలు పొందే హక్కు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని భారతీయ బ్యాంకుల బృందానికి లభించింది. లండన్ హైకోర్టుకు చెందిన కమర్షియల్ కోర్టు విభాగ న్యాయమూర్తి జస్టిస్ రాబిన్ నాలెస్ ఈ మేరకు తీర్పు చెప్పారు. 'బ్యాంకుల వాదన సంతృప్తికరంగా ఉంది. ఆయా ధ్రువీకరణ పత్రాలు లేకపోతే, అవి ఎవరివని నిగ్గుతేల్చే అవకాశం వారికి లభించదు. అది తేలితేనే వాటిని జప్తు చేసే అవకాశం ఉంటుంది' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తమకు రావాల్సిన 1.145 బిలియన్ పౌండ్ల రుణం కింద ప్రపంచవ్యాప్తంగా ఉన్న మాల్యా ఆస్తులను స్తంభింపచేసే ప్రక్రియలో భారతీయ బ్యాంకులున్నాయి. విజయ్ మాల్యా తండ్రి విఠల్ మాల్యాకు చెందిన వీఎండీఎస్ ట్రస్ట్ యజమాని ఎవరో తేల్చే ధ్రువీకరణ కావాలనీ బ్యాంకులు కోరాయి. వివాదాస్పద ఆస్తులు ట్రస్ట్ ఆధీనంలో ఉన్నాయని ప్రకటించడమే ఇందుకు కారణం.

# బజాజ్ కొత్త సీటీ 110

**ప్రారంభ ధర రూ.37,997**

దిల్లీ: బజాజ్ ఆటో ప్రారంభ స్థాయి మోటార్‌సైకిల్ మోడల్ సీటీ 110లో కొత్త వెర్షన్‌ను విపణిలోకి విడుదల చేసింది. దీని ధరల శ్రేణి రూ.37,997- 44,480 (ఎక్స్- షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త సీటీ 110లో గ్రౌండ్ క్లియరెన్స్ పెంచడంతో పాటు, బలమైన, పెద్ద క్రాష్ గార్డ్స్, కఠినమైన రహదారులపై సస్పెన్షన్ వంటి వాటిని చేర్చామని బజాజ్ ఆటో తెలిపింది. 115 సీసీ ఇంజిన్ కలిగిన ఈ బైకు గరిష్ఠంగా 8.6 పీఎస్ శక్తిని అందిస్తుంది. కిక్ స్టార్ట్ వెర్షన్ ధర రూ.37,997గా, ఎలక్ట్రిక్ స్టార్ట్ వేరియంట్ ధర రూ.44,480గా ఉన్నాయి. ఆకర్షణీయమైన ధరకు మంచి బైకు కోరుకునే వినియోగదారుల కోసం సీటీ శ్రేణి బైకులను రూపొందించామని బజాజ్ ఆటో అధ్యక్షుడు (మోటార్‌సైకిల్ వ్యాపారం) సారంగ్ కనాడే పేర్కొన్నారు. ఇప్పటి వరకు కంపెనీ 50 లక్షలకు పైగా సీటీ శ్రేణి బైకులను విక్రయించింది.

# ఇక వన్‌ప్లస్ టీవీలు!

- పరిశోధన - అభివృద్ధి జరుగుతోంది
- దీపావళికి మెరుగు పరచిన స్మార్ట్‌ఫోన్
- ఇంటివద్దే ఫోన్ల మరమ్మతు
- హైదరాబాద్ ఆర్ అండ్ డీలో 3 ఏళ్లలో 1000 మంది
- నోయిడాలో సొంత తయారీప్లాంటు నెలకొల్పుతాం



**ఇంటర్వ్యూ**
**వన్‌ప్లస్ ఇండియా అధిపతి వికాస్ అగర్వాల్**

స్మార్ట్‌ఫోన్లకు విక్రయానంతర సేవలు (సర్వీస్) కొనుగోలుదారుల ఇళ్ల వద్దే అందించేందుకు ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల సంస్థ వన్‌ప్లస్ సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది పండుగ సీజన్ నాటికి మెరుగుపరచిన స్మార్ట్‌ఫోన్ మోడల్‌ను ఆవిష్కరించనుంది. వినియోగదార్లకు ప్రత్యేక వినోద అనుభవాన్ని అందించేలా స్మార్ట్‌టీవీని అభివృద్ధి చేస్తోంది. తమ ప్రీమియం ఉత్పత్తులన్నింటినీ, తిలకించి, వాటి ప్రత్యేకతలు తెలుసుకుని, కొనుగోలు చేసుకునేందుకు వీలుగా గొలుసుకట్టు (చెయిన్) విక్రయశాలల సంస్థల్లో అందుబాటులోకి తెస్తున్నట్లు వన్‌ప్లస్ ఇండియా అధిపతి, జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్ వచ్చిన ఆయన 'ఈనాడు' ఇంటర్వ్యూలో ఈ విషయాలు వెల్లడించారు. ముఖ్యాంశాలివీ..

**? ప్రీమియం స్మార్ట్‌ఫోన్లలో పోటీ తీవ్రమవుతోంది. మీరు ఎలా అధిగమిస్తున్నారు**

**వికాస్:** దేశీయంగా ప్రీమియం (రూ.35-45 వేలు), అధిక ప్రీమియం (రూ.45 వేల పైబడి) స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 15-20 శాతం వృద్ధి లభిస్తోందన్నది మార్కెట్ వర్గాల అంచనా. గత ఏడాది ఈ శ్రేణి ఫోన్లు 50 లక్షలు విక్రయమైతే, ఇందులో మూడోవంతు మావే. 2017 అమ్మకాలతో పోలిస్తే, 2018లో సంఖ్యాపరంగా 60 శాతం వృద్ధి లభించింది. ప్రస్తుతం విడిభాగాలను దిగుమతి చేసుకుని, నోయిడాలోని మూడోపార్టీ ప్లాంటులో బిగింపు చేస్తున్నాం. తగినంత అమ్మకాలు లభించాక సొంత తయారీ యూనిట్ నెలకొల్పుతాం. స్మార్ట్‌ఫోన్ యూజర్ ఇంటర్‌ఫేస్, బ్యాటరీ సామర్థ్యం, కెమెరా, సౌండ్.. ఇలా ప్రతి విభాగంలోనూ అత్యున్నత వినియోగ అనుభవం అందించడమే ధ్యేయం. 40 దేశాల్లో విక్రయాలు జరుపుతున్నాం. అమెరికా విపణిలో విజయవంతమయ్యాం. యునైటెడ్ కింగ్‌డమ్‌లో 5జీ ఫోన్లు ప్రవేశ పెట్టాం. ప్రపంచంలోనే ప్రీమియం విభాగంలో నాలుగో అతిపెద్ద సంస్థగా నిలిచాం. మనదేశంలోనూ 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి రాగానే, ఆ మోడళ్లు విడుదల చేస్తాం. తక్కువ ధర మోడళ్లకు దూరంగానే ఉంటాం.

**? ఆన్‌లైన్‌కే పరిమితమైన సంస్థ, ఇప్పుడు సంప్రదాయ దుకాణాలకు చేరడానికి కారణం**

ఇప్పటివరకు ప్రీమియం శ్రేణి ఫోన్లే విక్రయించాం. ఇప్పుడు అధిక ప్రీమియం ఫోన్లకు 7ప్రో మోడల్‌తో ప్రవేశించాం. ఈ స్థాయి ఫోన్లను పరిశీలించి, కొనుగోలు చేసుకునే వారు ఎక్కువ. ఇక మొబైల్ విక్రయాల్లో సంప్రదాయ దుకాణాల వాటాయే 60 శాతం ఉంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని, సమగ్రంగా పరిశీలించుకున్నాకే, మా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసుకోవాలనే వారికి అనువుగా దుకాణాలకు చేరుతున్నాం. దేశవ్యాప్తంగా షోరూంలు నిర్వహిస్తున్న రిలయన్స్ డిజిటల్, క్రోమాతో పాటు సంగీతా, పూర్విక, బజాజ్ ఎలక్ట్రానిక్స్‌తో ఒప్పందం చేసుకున్నాం. మొత్తంమీద 25 నగరాలలో 2,000 షోరూంలలో మా ఉత్పత్తులున్నాయి. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో 16,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్ స్టోర్‌ను డిసెంబరులోపు ప్రారంభిస్తాం. బెంగళూరు, చెన్నై, దిల్లీ, పుణెలలో సొంత షోరూంలున్నా, ఇదే పెద్దది.

**? విక్రయానంతర సేవల్లోనూ ప్రీమియం ప్రత్యేకత చూపుతారా**

తప్పనిసరిగా.. మా సేవా కేంద్రానికి వెళ్లిన వినియోగదారులకు గంటలోపే సేవ పూర్తి చేసి, ఇచ్చేలా ప్రణాళిక రూపొందించాం. దేశవ్యాప్తంగా మాసొంత సేవా కేంద్రాలు 25 ఉండగా, మరిన్ని మూడోపార్టీ కేంద్రాలున్నాయి. ఇప్పుడు కొత్తగా ఇంటి వద్దకే సేవలు అందించాలని నిర్ణయించి, బెంగళూరులో ప్రయోగాత్మకంగా ప్రారంభించాం. వినియోగదారులు ఫోన్ చేస్తే, ఇంటికే వచ్చి, మరమ్మతు చేసి, ఇచ్చి వెళ్తారు. క్రమంగా అన్ని ప్రాంతాలకు ఈ సదుపాయాన్ని విస్తరిస్తున్నాం.

**? ఇతర ఉత్పత్తులు ఏవైనా ఆవిష్కరించనున్నారా**

ప్రీమియం స్మార్ట్ టీవీని ఆవిష్కరించే యత్నాల్లో ఉన్నాం. ఇది పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) దశలో ఉంది. హైదరాబాద్ ఆర్ అండ్ డీ కేంద్రంలో ప్రస్తుతం 150 మంది ఇంజినీర్లు ఉన్నారు. అంతర్జాతీయంగా మాకు అతి పెద్ద ఆర్ అండ్ డీ కేంద్రం అవుతుంది. మూడేళ్లలో 1000 మందిని ఇక్కడ నియమిస్తాం. సెప్టెంబరులోపు దీన్ని ప్రారంభిస్తాం. త్వరలో భారత్ నుంచి ఎగుమతులూ చేస్తాం. ఏడాదికి ఒక ఉత్పత్తిని మాత్రమే అత్యున్నత ప్రమాణాలతో ఆవిష్కరించాలన్నది ధ్యేయం.

- ఈనాడు వాణిజ్య విభాగం

# ఐదేళ్లలోగా రూ.35,000 కోట్ల పెట్టుబడులు!



- సౌర, పవన విద్యుత్ రంగంపై దృష్టి
- భారత్‌లో మంచి అవకాశాలు
- తెలంగాణలో విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం
- సీఎల్‌పీ ఇండియా సీఈఓ రాజీవ్ రంజన్ మిశ్రా

ఈనాడు - హైదరాబాద్

దేశంలో విద్యుత్‌ను ఉత్పత్తి రంగంలో ఉన్న సీఎల్‌పీ ఇండియా రానున్న మూడు నుంచి ఐదేళ్ల కాలంలో రూ.35,000 కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రయత్నాల్లో ఉంది. ఇప్పటికే ఈ సంస్థ థర్మల్, గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలతోపాటు పలు రాష్ట్రాల్లో పవన, సౌర విద్యుత్ కేంద్రాలను నిర్వహిస్తోంది. తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లాలోని వెల్దూరు వద్ద రూ.750 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాల్లో 100 మెగా వాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పింది. పునరుత్పాక ఇంధన వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి చేయడానికి తాము మరింత విస్తృతంగా పెట్టుబడులు పెడుతున్నట్లు సీఎల్‌పీ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తమ గ్రూపు 30బిలియన్ హాంకాంగ్ డాలర్ల విలువ ఉందని తెలిపారు. ఇందులో 5శాతం ఇండియా వాటా ఉందన్నారు. దేశంలో, తెలంగాణలో ఉన్న ఈ రంగానికి ఉన్న అవకాశాల గురించి మాట్లాడుతూ...

### వృద్ధికి అవకాశం..

ఆరేళ్ల క్రితం 2022 కల్లా.. దేశంలో 20 గిగావాట్ పునరుత్పాదక ఇంధన విద్యుత్ ఉత్పత్తి జరగాలని లక్ష్యంగా నిర్ణయించింది ప్రభుత్వం. అయితే, దీన్ని దాదాపు 175 గిగావాట్ విద్యుత్ సామర్థ్యానికి చేర్చాలని అనుకుంటోంది. దీంతో ఇక్కడ ఉన్న అపార అవకాశాలు అంతర్జాతీయంగా ఈ రంగంలో ఉన్న ఎన్నో కంపెనీలను ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే ఇక్కడ ఉన్న సంస్థగా ఈ దిశలో మరిన్ని పెట్టుబడులకు మేము ముందుకు వస్తున్నాం. అవసరాన్ని బట్టి, పవన, సౌర విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి స్థిరంగా పెట్టుబడులు పెడతాం. పెట్టుబడులు పెడతాం. చాలా రాష్ట్రాలు ఈ విద్యుత్ ఉత్పత్తికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాలతో ఇబ్బందులూ వస్తున్నాయి. కాంట్రాక్టులను గౌరవించకపోతే.. కొత్త అంతర్జాతీయ పెట్టుబడుల విషయంలో కొంత అనిశ్చితి ఏర్పడే అవకాశం లేకపోలేదు.

### తెలంగాణలో..

సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు తెలంగాణలో ఇప్పటికే రూ.750 కోట్ల పెట్టుబడులు పెట్టాం. ఇక్కడి ప్రభుత్వం ప్రోత్సాహం బాగుంది. టీఎస్ ఐపాస్, సులభతర వ్యాపార నిర్వహణ విధానంలాంటివి మాకు ఎంతో ఉపయోగపడ్డాయి. దేశంలో మాకు మొత్తం 1100 మెగావాట్ల పవన, సౌర విద్యుత్ కేంద్రాలున్నాయి. ఇందులో పవన విద్యుత్ 924 మెగావాట్లుండగా మిగతాది సౌర విద్యుత్. గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ విద్యుత్ ఉత్పత్తికి మంచి అవకాశాలున్నాయి. భవిష్యత్తులో మా విస్తరణ ఈ రాష్ట్రాల్లోనే ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో సోలార్ పవర్‌లో మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాం. దీనికోసం మా వ్యాపార నిర్వహణ సూత్రాలకు దగ్గరగా ఉన్న పెద్ద సంస్థలను విలీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఈ దిశగా కొన్ని సంస్థలను గుర్తించాం. తెలంగాణలో రానున్న 6-8 నెలల్లో 1,000 మెగా వాట్ సౌర విద్యుత్‌ను అదనంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా విధించుకుంది. ఇది మాకు మంచి అవకాశమే.

**పంపిణీ రంగంలోకి...:** ప్రస్తుతం హాంకాంగ్, ఆస్ట్రేలియాల్లో విద్యుత్ ఉత్పత్తితో పాటు, అంతిమ వినియోగదారుడిని చేరేంత వరకూ విద్యుత్ సరఫరా, పంపిణీలోనూ ఉన్నాం. భారత్‌లోనూ ఈ దిశగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం. ఇప్పుడుకాకున్నా.. భవిష్యత్తులో ఈ రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.

### విద్యుత్ వాహనాలకు...

దేశంలో విద్యుత్ వాహనాల వినియోగానికి సంబంధించి మేము పూర్తి సానుకూలంగా ఉన్నాం. ఇప్పటికే హాంకాంగ్‌లో ఉన్న మా ఇన్నోవేషన్ గ్రూపు స్మార్ట్ గ్రిడ్, స్మార్ట్ మీటర్లతోపాటు, విద్యుత్ వాహనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు సంబంధించి పరిశోధన, అభివృద్ధి చేస్తోంది. దీంతోపాటు గ్రిడ్‌లకు ఉన్న సైబర్ రిస్క్ నుంచి కాపాడేందుకు ఏం చేయాలన్న విషయంలోనూ ఇక్కడ పరిశోధన జరుగుతోంది. రానున్న ఐదారేళ్లలో మా సంస్థకు సంబంధించిన అన్ని రకాల వాహనాలూ విద్యుత్‌వే ఉండాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్నాం.

### ఉపాధి అవకాశాలు పెరుగుతాయి..

సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి వల్ల ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం పవన విద్యుత్‌కు సంబంధించిన అన్ని రకాల పరికరాలూ దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నాయి. వీటి తయారీ, రవాణా, నిర్మాణం, నిర్వహణ వల్ల ఇప్పటికే ఎన్నో లక్షల ఉద్యోగాలు వచ్చాయి. సౌర విద్యుత్ ఫలకాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. గతంతో పోలిస్తే ఈ సౌర ఫలకాల సాంకేతికత మారింది. ఖర్చు కూడా సగం వరకూ తగ్గింది. వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం ప్రారంభిస్తే మరిన్ని ఉద్యోగాలు వస్తాయి.

# బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్లు



సోమవారం హైదరాబాద్ (కూకట్‌పల్లి) బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలో వన్‌ప్లస్ 7 ప్రో విక్రయాలు ప్రారంభించిన వన్‌ప్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్, బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ కరణ్ బజాజ్

ఈనాడు, హైదరాబాద్: ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌లోనే విక్రయాలు జరుపుతున్న ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల సంస్థ వన్‌ప్లస్, సంప్రదాయ విక్రయశాలల్లోనూ అమ్మకాలపై దృష్టి పెట్టింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, తొలిసారిగా బజాజ్ ఎలక్ట్రానిక్స్‌తో ఒప్పందం చేసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని 54 బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంలలో వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్లు కొనుగోలు చేసుకోవచ్చని వన్‌ప్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికాస్ అగర్వాల్ సోమవారం ఇక్కడ ప్రకటించారు. ఇటీవల ఆవిష్కరించిన వన్‌ప్లస్ 7, 7 ప్రో స్మార్ట్‌ఫోన్లతో ప్రారంభించి, అన్ని మోడళ్లు లభిస్తాయని తెలిపారు. దేశీయ ప్రీమియం (రూ.30,000 పైన) స్మార్ట్‌ఫోన్ విపణిలో తమకు 35 శాతం వాటా ఉందని, ఆన్‌లైన్‌లో అయితే 50 శాతం వాటా ఉందన్నారు. ఆన్‌లైన్, సంప్రదాయ దుకాణాల్లోనూ ధరల్లో మార్పుండదని చెప్పారు. తమ మొత్తం టర్నోవర్‌లో సెల్‌ఫోన్లు, అనుబంధ పరికరాలు, ల్యాప్‌టాప్‌ల వంటి ఐటీ విభాగ వాటా 25 శాతం ఉందని బజాజ్ ఎలక్ట్రానిక్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) కరణ్ బజాజ్ తెలిపారు. వన్‌ప్లస్‌తో ఒప్పందం వల్ల ఈ విభాగ విక్రయాలు మరింత పెరుగుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.




## నాపైనా కేసు పెట్టండి

- ఎంపీ కోమటిరెడ్డికి కేంద్ర మంత్రి గడ్కరీ సూచన
- జాతీయ రహదారుల నిర్మాణంలో జాప్యంపై వ్యాఖ్య
- తెలంగాణ ఎంపీలతో భేటీ
- పలు ప్రతిపాదనలు సమర్పించిన తెరాస ఎంపీలు

ఈనాడు, దిల్లీ: జాతీయ రహదారి నిర్మాణంలో జాప్యంపై గుత్తేదారుతో పాటు తనపైన, మంత్రిత్వ శాఖ కార్యదర్శులపైన ఎఫ్ఐఆర్ (కేసు) నమోదు చేయించాలని కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. జాతీయ రహదారుల అంశంపై రాష్ట్ర ఎంపీలతో సోమవారం ఉదయం కేంద్ర మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి నకిరేకల్-నాగార్జున సాగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-565) 2014లో ప్రారంభమై ఇప్పటికీ పూర్తి కాలేదని.. ప్రమాదాలతో 70 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 82.676 కిలోమీటర్ల రహదారిలో 46.54 కిమీ మాత్రమే పూర్తి చేశారని పేర్కొన్నారు. భూసేకరణకు రూ.32.25 కోట్లు, రహదారి పనికి రూ.223.86 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేంద్ర మంత్రి ఆలస్యానికి, ప్రమాదాలకు మేం కారణమైనందున గుత్తేదారుతో పాటు తనపైనా, శాఖ కార్యదర్శులపైనా కేసు పెట్టాలన్నారు. మీపై ఎలా కేసు పెడతామని కోమటిరెడ్డి అనగా.. అలా కేసు పెట్టినప్పుడే ఏళ్లుగా ఆగిన పనులు మూడు రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు.

### ఎల్‌బీనగర్ - అబ్దుల్లాపూర్‌మెట్ రహదారిని విస్తరించండి

హైదరాబాద్‌లో ఎల్‌బీనగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు 8 వరుసలుగా రహదారి విస్తరణకు భూసేకరణ పూర్తయిందని వెంటనే పనులు చేపట్టాలని కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నల్గొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఈ మూడింటిని జాతీయ రహదారులుగా గుర్తించాలి

తెరాస లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు నేతృత్వంలో కేంద్ర మంత్రిని కలిసిన ఆ పార్టీ ఎంపీలు.. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. 3,155 కిలోమీటర్ల మేర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించేందుకు సూత్రప్రాయంగా అంగీకరించారని.. ఇప్పటివరకు 1,388 కిలోమీటర్ల రహదారులను మాత్రమే గుర్తించారని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో ఆలస్యంపై ముఖ్యమంత్రి కేసీఆర్ పలుమార్లు లేఖలు రాశారని గుర్తుచేశారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్- వలిగొండ- తొర్రూర్- మహబూబాబాద్- ఇల్లెందు- కొత్తగూడెం; మెదక్- ఎల్లారెడ్డి- రుద్రూర్- బోధన్- బాసర- భైంసా, మెదక్- సిద్దిపేట- ఎల్కతుర్తి మార్గాలను జాతీయ రహదారులుగా గుర్తించాలని కోరారు. చౌటుప్పల్- షాద్‌నగర్- కంది మార్గాలను రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాంతంగా, సంగారెడ్డి- నర్సాపూర్- తూప్రాన్- గజ్వేల్- భువనగిరి- చౌటుప్పల్‌ను రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర ప్రాంతంగా గుర్తించి ఈ రెండింటిని అనుసంధానించాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర ప్రాంతాన్ని ఇప్పటికే ఎన్‌హెచ్-161 ఏఏగా ప్రకటించారని మంత్రికి తెలిపారు. జాతీయ రహదారులకు భూసేకరణ, నిర్వాసితుల తరలింపు, అటవీ భూముల మళ్లింపులో 50 శాతం వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించడానికి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారని వివరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పెద్దపల్లి ఎంపీ డాక్టర్ వెంకటేశ్ నేత, నాగర్‌కర్నూల్ ఎంపీ పి.రాములు, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సోమవారం దిల్లీలో వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు పి.రాములు, వెంకటేశ్ నేత. పక్కన నామా నాగేశ్వరరావు, మన్నె శ్రీనివాసరెడ్డి

## ఎన్‌హెచ్ఆర్‌సీకి కోరలు కల్పించాలి

- తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు

ఈనాడు, దిల్లీ: జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ)కు కోరలు కల్పించాలని తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు సూచించారు. మానవ హక్కుల రక్షణ (సవరణ) బిల్లు-2019పై రాజ్యసభలో సోమవారం ఆయన మాట్లాడారు. మన ఎన్‌హెచ్ఆర్‌సీని కోరలు లేని పులిగా సుప్రీంకోర్టు వర్ణించిందని.. కమిషన్ సైతం తనను తాను ఆదేవిధంగా చెప్పుకొందని తెలిపారు. ఎన్‌హెచ్ఆర్‌సీ కేవలం సూచనలు చేసే సంస్థగా మిగిలిపోయిందని, ఆ సూచనలను సైతం పోలీసులు పరిగణించడంలేదని పేర్కొన్నారు. కమిషనర్లుగా నిపుణులైన వ్యక్తులను నియమించాలని సూచించారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.5 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు పి.రాములు కోరారు. లోక్‌సభలో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణలోనూ వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల్లో పెద్ద సంఖ్యలో విద్యావంతులైన యువకులు ఉన్నారని.. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. స్వయం ఉపాధికి ఊతమివ్వాలని, అప్పటివరకు నిరుద్యోగ భృతి కల్పించాలని సూచించారు.

### జల్‌జీవన్‌కు అనుగుణంగా భగీరథకు నిధులు

ఈనాడు, దిల్లీ: ఇంటింటికీ నీరు (హర్ ఘర్ జల్) పథకంలో భాగంగా జల్‌జీవన్ మిషన్‌కు అనుగుణంగా తెలంగాణకు వచ్చే నిధులనే ఇస్తామని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా తెలిపారు. మిషన్ భగీరథకు కేంద్ర నిధులపై రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ సమాధానం ఇచ్చారు.

- ఆంధ్రప్రదేశ్‌లో 27, తెలంగాణలో 5 ఖాదీ సంస్థలు ఖాయిలా పడినట్లు కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఎంపీ సీఎం రమేష్ అడిగినప్రశ్నకు ఈ సమాధానం ఇచ్చారు.

# మత్స్యకారులకు బహుమీనం

- కాళేశ్వరంలో చేపల పెంపకం
- కోటిన్నర చేప, రొయ్య పిల్లలు వదిలేందుకు ప్రతిపాదనలు సిద్ధం
- కాళేశ్వరం నుంచే పంపిణీ ప్రారంభం
- మూడు జిల్లాల్లో మత్స్యశాఖ బేస్‌లైన్ సర్వే
- వేలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్ర ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టులో కోటిన్నర చేప, రొయ్య పిల్లలు వదలాలని మత్స్యశాఖ నిర్ణయించింది. మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రాజెక్టుపై బేస్‌లైన్ సర్వే చేసిన ఆ శాఖ సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ మూడు జిల్లాల్లో దాదాపు 30 గ్రామాలకు చెందిన



వేలాది మత్స్యకార కుటుంబాలకు కాళేశ్వరం జీవనోపాధిగా మారనుందని సర్వేలో తేల్చి చెప్పింది. చేపలు వదిలేందుకు, పట్టేందుకు అనువైన ప్రాంతాలను సైతం గుర్తించామని, ఈ ప్రక్రియ ప్రారంభమైతే చేపల ఉత్పత్తి, ఎగుమతులకు రాష్ట్రం తలమానికమవుతుందని, కొన్ని జాతులకు రాష్ట్రం శాశ్వత చిరునామా అవుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

### పది రకాలు పెంపకానికి అనుకూలం

సర్వే చేసిన ప్రాంతాల్లో ప్రస్తుతం 320 టన్నుల చేపల లభ్యత ఉంది. ఇక్కడ పట్టిన చేపలు మంచిర్యాల, గోదావరిఖని, మంథని, మహదేవ్‌పూర్, కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం, పలిమెల ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. తాజా సర్వే ప్రకారం నీటి లభ్యత, ప్రవాహం ఆధారంగా పది రకాల చేపలు సహా, రొయ్యలు పెంచేందుకు ఇక్కడ అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నట్లు గుర్తించారు. బొచ్చ, రాహు, తిలాపియా, బాపెరా, కొరమీను, జెల్ల, వాలుగ తదితర జాతులు సులభంగా ఎదుగుతాయని అధికారులు చెబుతున్నారు. మొత్తం ముప్పై గ్రామాల్లో 19 ప్రదేశాలు వేటకు అనువుగా ఉన్నాయని తేల్చారు. మంచిర్యాల జిల్లాల్లో పొక్కుర్, శివ్వారం, సోమన్‌పల్లి, శెట్‌పల్లి, పెద్దపల్లి జిల్లాలో ఆరెండ, మంథని, బెస్తపల్లి, విలోచవరం, సుందిళ్ల, ముస్త్యాల, జనగామ, గుంజెపడుగు, రాయదండి భూపాలపల్లిలో కాళేశ్వరం, సూరారం, అన్నారం, రాపల్లికోట, మహదేవ్‌పూర్, అంబటిపల్లి ప్రాంతాలు చేపలు వేటకు అనుకూలమని నిర్ధారించారు.

### ప్రారంభం ఎక్కడంటే

చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి కాళేశ్వరం నుంచే మొదలుపెట్టే అవకాశం ఉందని మత్స్యశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మేడిగడ్డ- అన్నారం లేదా అన్నారం-సుందిళ్ల మధ్య ఎక్కడో ఒక చోట పిల్లలు వదిలే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. "ఇప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు లేక చాలా వరకు చెరువుల్లోకి నీరు రాలేదు. అందుకే కాళేశ్వరంలోనే పంపిణీని ప్రారంభించాలని భావిస్తున్నాం. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ల దృష్టికి కూడా తీసుకెళ్లాం" అని ఆయన వెల్లడించారు.

| బేస్‌లైన్ సర్వేలో ముఖ్యాంశాలు.. | |
|---|---|
| ■ సర్వే చేసిన జిల్లాలు | : 3 |
| ■ గోదావరి ప్రవాహ ప్రాంతం | :174కిలోమీటర్లు |
| ■ లోతు | : 5 నుంచి 12 మీటర్లు |
| ■ చేపలు పట్టే గ్రామాలు | : 27 |
| ■ మత్స్యకారుల సంఖ్య | : 2,674 |
| ■ చేపలవేటకు అనువైన ప్రాంతాలు | : 19 |
| ■ బోట్లు, వలలు నిలుపుకునేందుకు అనువైన ప్రాంతాలు | : 8 |

జిల్లాల వారిగా చేప, రొయ్య పిల్లల పంపిణీ

| జిల్లా | చేప పిల్లలు లక్షల్లో | రొయ్య పిల్లలు లక్షల్లో |
|---|---|---|
| మంచిర్యాల | 29.44 | 1.84 |
| పెద్దపలి | 44.80 | 11.20 |
| భూపాలపల్లి | 50.00 | 12.00 |
| మొత్తం | 124.24 | 25.04 |

## మంత్రి నిరంజన్‌రెడ్డికి మాతృ వియోగం



తారకమ్మ

వనపర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి తారకమ్మ(105) సోమవారం తెల్లవారుజామున వనపర్తిలోని మంత్రి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. శతాధిక వయస్కురాలైన తారకమ్మ చివరిదాకా ఎంతో హుషారుగా ఉండి, తన పనులు తానే చేసుకునేవారు. నెల రోజుల నుంచి స్వల్ప అస్వస్థతతో లేవలేని స్థితిలో ఉండిపోయారు. తారకమ్మకు అయిదుగురు కుమార్తెలు, నిరంజన్‌రెడ్డి ఒక్కరే కుమారుడు. తారకమ్మ మరణవార్త విని విద్య, ఆబ్కారీ శాఖల మంత్రులు జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వనపర్తికి తరలివచ్చి నిరంజన్‌రెడ్డిని ఓదార్చారు.

### సీఎం కేసీఆర్ సంతాపం

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాతృమూర్తి తారకమ్మ మృతిపై ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ ఎంపీలు వినోద్, కల్వకుంట్ల కవిత సంతాపం తెలిపారు.

## ఈడీ ఎదుటకు గాలి జనార్దనరెడ్డి

- ఖరీదైన కారు, పోలీస్ ఎస్కార్టుతో హాజరు

ఈనాడు, హైదరాబాద్: కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. తన సహాయకుడు అలీఖాన్‌తో కలిసి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో బషీరాబాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చిన ఆయన ఐదు గంటలపాటు లోపలే ఉన్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇనుప ఖనిజం విదేశాలకు ఎగుమతి చేసే సందర్భంగా విదేశీ మారక ద్రవ్యం వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న అభియోగాలపై ఈడీ ఆయనపై గతంలో కేసులు నమోదు చేసింది. వాటి విచారణలో భాగంగా ఆయన ఈడీ అధికారుల ఎదుట హాజరైనట్లు తెలుస్తోంది. ఈడీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత జనార్దనరెడ్డి దానికి భిన్నమైన వాదన వినిపించారు. తన ఆస్తుల విడుదలలో జరిగిన జాప్యంపై ఈడీ అధికారులతో చర్చించడానికి వచ్చినట్లు విలేకర్లతో చెప్పారు. "ఓబులాపురం మైనింగ్ కంపెనీకి(ఓఎంసీ) సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు విడుదల చేయాలని కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశా. విచారించిన న్యాయస్థానం ఈడీ కేసులన్నీ కొట్టేయడంతోపాటు ఓఎంసీ



ఆస్తులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఈడీ అధికారులు సుప్రీం కోర్టుకు వెళ్లారు. సుప్రీం కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. నా ఆస్తులను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. అయినా అధికారులు నాకు సంబంధించిన రూ.వెయ్యికోట్ల విలువైన ఆస్తులు విడుదల చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఆ విషయమై అధికారులతో మాట్లాడేందుకే వచ్చా" అని ఆయన పేర్కొన్నారు. ఆస్తుల విడుదలలో మరింత జాప్యం జరిగే పక్షంలో మరోమారు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని వెల్లడించారు.

ఖరీదైన కార్లో ఈడీ కార్యాలయానికి వచ్చిన జనార్దనరెడ్డికి రక్షణగా భద్రత సిబ్బందితో కూడిన పోలీసు వాహనం కూడా వచ్చింది. గతంలో కర్ణాటక మంత్రిగా, ఎంపీగా పనిచేసిన ఆయన ప్రస్తుతం రాజకీయలలో క్రియాశీలంగా లేరు. అయినా ఆయన పోలీసు భద్రతతో రావడం గమనార్హం.

## వైకాపా దుష్ప్రచారంతోనే ప్రపంచబ్యాంకు రుణం రద్దు

### చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు రుణం ఇవ్వకపోవడానికి పూర్తి బాధ్యత వైకాపాదేనని, ఆ పార్టీ నాయకులు కొందరు రైతులతోనూ, స్వచ్ఛంద సంస్థలతోనూ చేయించిన తప్పుడు ఫిర్యాదుల వల్లే ఆ పరిస్థితి తలెత్తిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు ధ్వజమెత్తారు. మంగళగిరి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డే ఆ ఫిర్యాదులు చేయించారన్నారు. సోమవారం మంగళగిరి సమీపంలోని హ్యాపీ రిసార్ట్స్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజధాని ప్రాజెక్టుల్లో అవినీతి కారణంగానే బ్యాంకు వెనక్కు తగ్గిందంటూ వైకాపా నాయకులు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రపంచబ్యాంకు గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ రాజధాని పనుల్లో అవినీతి జరిగిందని అనలేదని చెప్పారు. "రాజధాని నిర్మాణంపై వైకాపా ప్రభుత్వానికి ఆసక్తి లేదు. దాన్ని మరో వాన్‌పిక్, లేపాక్షి ప్రాజెక్టుల్లా చేయాలనుకుంటోంది. జగన్ తీరు చూస్తే... చంద్రయాన్ ప్రాజెక్టులోనూ అవినీతి జరిగిందని, దానికి రూ.వెయ్యి కోట్లు ఖర్చు ఎందుకని అనేలా ఉన్నారు. తానైతే ఆ ప్రాజెక్టు చేపట్టేవాడిని కాదనీ అంటారు. ఆ పెద్దమనిషి పద్ధతి అలా ఉంది" అని ఎద్దేవా చేశారు.

## ఉపాధ్యాయులకు ఇక బ్రిటిష్ కౌన్సిల్ శిక్షణ

### ఉన్నత విద్యామండలితో విస్తృత ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనకు సంబంధించిన శిక్షణ ఇచ్చేందుకు బ్రిటిష్ కౌన్సిల్ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో తెలంగాణ ఉన్నత విద్యామండలితో సోమవారం బ్రిటిష్ కౌన్సిల్ మహిళా ప్రతినిధి జనక్ పుష్పనాథన్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉద్యోగావకాశాల పెంపుదల, ఇతర అంశాలపై కూడా అంగీకారానికి వచ్చారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో ఇంగ్లాండ్‌కు చెందిన 15 మంది విశ్వవిద్యాలయ ఉపకులపతులు రాష్ట్రానికి రానున్నారు. కొత్త సంవత్సరం జనవరి 21, 22లలో లండన్‌లో జరిగే ప్రపంచ విద్యాసదస్సులో పాల్గొనాలని విద్యాశాఖ మంత్రితో పాటు కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులను మహిళా ప్రతినిధి ఆహ్వానించారు. ఒప్పంద కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ప్రముఖులు పాల్గొన్నారు.

## నిబంధన తొలగింపునకు కారణాల్లేవుగా?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- ఒక చట్ట పరిధిలోకి మరోచట్టం చొచ్చుకురాజాలదు: ప్రభుత్వం
- ఎర్రమంజిల్ కూల్చివేతపై కొనసాగుతున్న వాదనలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ చట్టంలోని నిబంధన-13 తొలగించడానికి కారణాలను జీవో 183లో ఎందుకు పేర్కొనలేదంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం హైకోర్టు ప్రశ్నించింది. దాని తొలగింపునకు కారణాలను ఇప్పటికిప్పుడు అతికించినట్లుగా చెబుతున్నారని వ్యాఖ్యానించింది. ఒక నిబంధనను చేర్చాలన్నా, తొలగించాలన్నా దానికి కారణాలను పేర్కొనాలని, ఇక్కడ నిబంధన-13ను తొలగించడానికి ఎలాంటి కారణాలనూ పేర్కొనలేదని వ్యాఖ్యానించింది. మాస్టర్ ప్లాన్‌లో ఈ నిబంధన కొనసాగుతోందని, దాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే



పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. నూతన చట్టసభల సముదాయం నిర్మాణానికి ఎర్రమంజిల్ భవనం కూల్చివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్. చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌ల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ నిబంధనలు చేసే అధికారం హుడా చట్టానికి లేదని తెలిపారు. అందులోనూ పట్టణాభివృద్ధి చట్టం అభివృద్ధి, జోనింగ్ నిబంధనలు తదితరాలను మాత్రమే చూడాలని చారిత్రక కట్టడాల పరిరక్షణ తదితరాల్లోకి వెళ్లరాదన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా చట్టం ఉందని, దానికింద ఏర్పాటైన సంస్థలకే చారిత్ర కట్టడాల పరిరక్షణ బాధ్యత ఉంటుందన్నారు. హుడా చట్టం కింద ఏర్పాటైన సంస్థ చారిత్రక కట్టడాల పరిరక్షణ చట్టం కింద ఉండాల్సిన సంస్థ బాధ్యతలను చేపట్టజాలదని, అందువల్ల దాన్ని తొలగించడానికి నిర్ణయించిందని చెప్పారు. 1960నాటి చట్టంలో చారిత్రక భవనాల ప్రస్తావన ఉందని, పురావస్తు భవనాల ప్రస్తకి లేదన్నారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం చారిత్రక, పురావస్తు కట్టడాల పరిరక్షణకు సమగ్ర చట్టం తీసుకువచ్చిందని తెలిపారు. హెచ్ఎండీఏ చట్టంలోని నిబంధన-13 మరో చట్టంలోకి చొచ్చుకువచ్చేలా ఉందని గుర్తించడంతో రాష్ట్ర ప్రభుత్వం దాన్ని రద్దు చేసిందని చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ పురావస్తు కట్టడాల పరిరక్షణకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని, గతంలో ముంబయిలో ఓ స్టోర్‌ను కూల్చివేయాలని కార్పొరేషన్ ప్రయత్నించగా తమ జ్ఞాపకాలు ఈ భవనంతో ముడిపడి ఉన్నాయని ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుందని, అదీ చట్టం స్ఫూర్తి అని వ్యాఖ్యానించింది. దీనిపై ఏఏజీ స్పందిస్తూ చట్టాలను తీసుకువచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. దీనిపై తదుపరి వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

## బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సు కౌన్సెలింగ్ 26న

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే బీఎస్సీ (హానర్స్) కమ్యూనిటీ సైన్స్‌కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థినులకు ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఆప్షనల్ సబ్జెక్టులలో పొందిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థినుల ఎంపిక జరుగుతుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు పిలిచిన అభ్యర్థినుల మెరిట్ లిస్ట్‌ను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పీజేటీఎస్ఏయూ.ఈడీయూ.ఇన్‌లో చూడాలని ఆయన వివరించారు. విద్యార్థినులు అసలు ధ్రువపత్రాలతో హాజరుకావాల్సి ఉంటుందని, ఫీజు చెల్లించకపోతే అడ్మిషన్ రద్దవుతుందని వివరించారు.

## అమరావతిలో భూముల విలువ పెంపు

### చదరపు గజం ధర రూ.5వేలు

ఈనాడు, అమరావతి: నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతంలో భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపుదలకు ఆమోద ముద్రపడింది. రాజధానిలోని 29 గ్రామాల్లో భూముల ధరల పెంపు ప్రతిపాదనల దస్త్రానికి సీఆర్‌డీఏ ఆమోదం తెలపటంతో ఆగస్టు ఒకటో తేదీ నుంచి కొత్త ధరల ప్రకారం రిజిస్ట్రేషన్లు చేయటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గజం ధర వెయ్యి నుంచి రూ.2,500 వరకు ఉండగా ప్రస్తుతం దీన్ని రూ.5 వేల వరకు పెంచారు. ఈ పెంపుదల 29 గ్రామాల్లో ఒకే రకంగా లేదు. కొన్ని చోట్ల గజం రూ.వెయ్యి ఉండగా దాన్ని రూ.2,500కు పెంచగా, రూ.2,500 ఉన్నచోట రూ.5 వేల వరకు పెంచారు. మొత్తంమీద రాజధాని ప్రాంతంలో ధరలు చదరపు గజానికి రూ.1500 నుంచి 3 వేల వరకు పెరిగాయి. రాజధానియేతర ప్రాంతాల్లో ఈ స్థాయిలో పెంచలేదు.

## పథకాలకు నిధుల్లేవు.. కొత్త భవనాలెందుకు?

- ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ 25న చలో సచివాలయం
- ప్రతిపక్ష పార్టీల నాయకుల వెల్లడి

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలకు నిధుల కొరత ఉండగా.. వాస్తు పేరుతో ప్రభుత్వం కొత్త సచివాలయం నిర్మాణానికి సిద్ధపడడం దారుణమని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో తెజస అధినేత కోదండరాం మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, బలహీనవర్గాల ఇళ్ల నిర్మాణాలకు నిధుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మంచిగానే ఉన్న సచివాలయాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మిస్తామని మొండిపట్టు పట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ, ప్రజాస్వామిక తెలంగాణ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఈ నెల 25న చలో సచివాలయం కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ వివేక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం లక్షా అరవైవేల కోట్ల వరకు రుణాలు పొందిన విషయాన్ని ఇటీవలే కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించిందన్నారు. రుణాలపై ప్రభుత్వం శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాలకు తోడు న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమైందని చెప్పారు. సమావేశంలో తెదేపా అధికారప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి, పార్వర్డ్ బ్లాక్ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కోదండరాం, పక్కన పి.ఎల్.విశ్వేశ్వరరావు, వివేక్, పొన్నం ప్రభాకర్, నన్నూరి నర్సిరెడ్డి, ప్రసాద్

## నల్లబ్యాడ్జీలతో వీఆర్వోల నిరసన

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో)పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వీఆర్వోలు నల్లబ్యాడ్జీలతో విధుల్లో పాల్గొన్నారు. నిర్దేశిత పనిగంటలను పాటించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలంగాణ వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికె ఉపేంద్రరావు తెలిపారు. నల్గొండ జిల్లా గొర్రంపోడు మండలంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## తల్లి ఆస్తి స్వాహా.. కొడుకు, కోడలికి జైలు శిక్ష



అమిత్‌కుమార్, శోభితాలావణ్య

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: భర్తను కోల్పోయి వృద్ధాప్యంలో ఒంటరిగా జీవిస్తున్న తల్లి ఆస్తిని స్వాహా చేసిన కొడుకు, కోడలికి మల్కాజిగిరి కోర్టు సోమవారం రెండేళ్ల జైలు శిక్ష విధించింది. నేరేడ్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని నేరేడ్‌మెట్ కాకతీయ నగర్‌కు చెందిన ప్రేమకుమారి(66)కి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు చేసింది. వారంతా విడివిడిగా ఉంటున్నారు. ప్రేమకుమారి భర్త 2013లో మరణించారు. అప్పటినుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో పెద్ద కుమారుడు అమిత్‌కుమార్(40), కోడలు శోభితాలావణ్య(34)లు 2015లో ఆమె ఇంట్లోకి వచ్చి మకాం వేశారు. ఆమెకు తెలియకుండా ఇంటిని కొడుకు తన పేరు మీద రిజిస్టర్ చేయించుకున్నాడు. అదే ఏడాది అక్టోబరు 13న ఇంటికి తాళం వేసి తల్లిని బయటకు గెంటేశాడు. ఏం చేయాలో తెలియక నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. ఈకేసు విచారించిన మల్కాజిగిరి 19 ఎంఎం మేజిస్ట్రేట్ సౌజన్య కొడుకు, కోడలికి రెండేళ్ల జైలు, రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

## రాజకీయ కోణంలోనే కొత్త కార్పొరేషన్లు, వార్డుల పునర్విభజన

- పొన్నం నేతృత్వంలోని కాంగ్రెస్ త్రిసభ్య కమిటీ ఆరోపణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలను గుర్తించకుండా రాజకీయ కోణంలోనే కొత్త మున్సిపల్ కార్పొరేషన్లు, వార్డుల పునర్విభజన చేశారని మున్సిపల్ ఎన్నికల వ్యవహారాలను పర్యవేక్షించేందుకు పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో టీపీసీసీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఆరోపించింది. ఓటమి భయంతోనే జనగణన, ఓటరు జాబితా, వార్డుల విభజన తప్పులు తడకగా చేపట్టారని విమర్శించింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సమర్థంగా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంది. సోమవారం గాంధీభవన్‌లో కమిటీ సభ్యులు పొన్నం ప్రభాకర్, ఎస్.ఎ.సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాంత ఓటర్లు కాంగ్రెస్‌కు అండగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 20, 25 వార్డులు ఉన్నవాటిని కార్పొరేషన్లు చేసి, 49 వార్డులున్న మహబూబ్‌నగర్‌ను ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వార్డులకు పోటీ చేసే అభ్యర్థుల నుంచి పార్టీ మారబోమంటూ హామీ పత్రాన్ని(అఫిడవిట్) ప్రజల ముందే తీసుకుంటామన్నారు. కుట్ర పూరితంగా కొత్త మున్సిపల్ చట్టం తీసుకువచ్చారని సంపత్‌కుమార్ ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుల వలన హైకోర్టులో కేసులు నమోదయ్యాయని, 14 మున్సిపాలిటీలపై కోర్టు స్టే ఇచ్చిందన్నారు. ఈ తప్పులకు మున్సిపల్ వ్యవహారాలశాఖ నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## హాజీపూర్ బాధిత కుటుంబాలను ప్రియాంకకు కలిపిస్తా: వీహెచ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: సైకో శ్రీనివాస్‌రెడ్డి చేతిలో అత్యాచారం, హత్యకు గురైన హాజీపూర్ బాధిత కుటుంబాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి కలిపిస్తానని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు తెలిపారు. ఇందుకోసం సమయం కేటాయించాలంటూ ప్రియాంకకు లేఖ రాశానని చెప్పారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. అమాయకపు పిల్లలు సైకో చేతిలో దారుణ హత్యకు గురైతే బాధిత కుటుంబాలను ముఖ్యమంత్రి కేసీఆర్ కానీ, మంత్రులు కానీ ఎవరూ ఇంత వరకు పరామర్శించలేదని మండిపడ్డారు.

# ఆలస్యమైనా అదే రోజు గమ్యానికి

ఇస్రో ఈ నెల 15న చేపట్టదలచిన ప్రయోగం.. చివరి నిమిషంలో సాంకేతిక సమస్య కారణంగా వాయిదాపడిన సంగతి తెలిసిందే. దానికి కారణాలను ఇస్రో ఇంజినీర్లు ఇతమిత్థంగా తేల్చి, నాలుగైదు రోజుల్లో సరిదిద్ది, తదుపరి ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఒక చిన్న సాధనంలో తలెత్తిన లోపంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లు గుర్తించారు. క్రయోజెనిక్ ఇంజిన్‌లోని హీలియం గ్యాస్ బాటిల్‌లో పీడనం పడిపోయింది. 'నిపల్ జాయింట్‌'లో లీకేజీ ఇందుకు కారణమైంది. నిపల్ అంటే.. ఒక చిన్న గొట్టం. రెండు గొట్టాలను అనుసంధానించడానికి నిపల్ జాయింట్‌ను ఉపయోగిస్తారు. క్రయోజెనిక్ ఇంజిన్‌లో ఇంధనాన్ని అత్యంత శీతల ఉష్ణోగ్రతల వద్ద నిల్వ చేస్తారు. ఈ ఇంధనానికి పీడనాన్ని అందించే పనిని హీలియం గ్యాస్ బాటిల్ చేపడుతుంది. 34 లీటర్ల సామర్థ్యముండే ఈ బాటిల్‌లో పీడనం 350 బార్ల మేర ఉండాలి. తద్వారా దాని నుంచి వెలుపలికి వచ్చే పీడనం 50 బార్ల మేర ఉంటుంది. అయితే నాడు ప్రయోగం రోజున పీడనం ప్రతి నిమిషానికి 4 బార్ల మేర పడిపోవడం మొదలైంది. నిజానికి ఇది పెద్ద సమస్యేమీ కాదు. ప్రయోగాన్ని కొనసాగించడానికి అవకాశం ఉందని, అయితే రిస్క్ తీసుకోరాదన్న ఉద్దేశంతో ప్రయోగాన్ని నిలిపివేసినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు చెప్పారు. దీనికి గతానుభవాలు కూడా తోడయ్యాయి. 1979లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఎస్‌ఎల్‌వీ రాకెట్‌లోనూ ఇదే 'పీడన' సమస్య తలెత్తి, ప్రయోగం విఫలమైంది.




నిజానికి ఏదైనా సమస్య తలెత్తితే దాన్ని సరిదిద్దడానికి రాకెట్‌ను కొంతమేర విడగొట్టక తప్పదు. అయితే హీలియం గ్యాస్ బాటిల్‌తో నేరుగా యాక్సెస్ ఉన్నందు వల్ల ఆ ఇబ్బంది శాస్త్రవేత్తలకు కలగలేదు. రాకెట్‌ను విడగొట్టాల్సి వస్తే మళ్లీ దాన్ని ప్రయోగానికి సిద్ధం చేయడానికి చాలారోజులు పట్టేది.

### ఆలస్యమైనా.. మార్పు లేదు..

నిర్దేశిత రీతిలో జీఎస్‌ఎల్‌వీ మార్క్‌-3.. చంద్రయాన్‌-2ను భూకక్ష్యలోకి భద్రంగా చేర్చింది. ఇక నుంచి అది అత్యంత సంక్లిష్టమైన విన్యాసాలను చేపడుతూ అంతిమంగా చంద్రుడి ఉపరితలంపై దిగుతుంది. ఇందులో అనేక దశలున్నాయి. మొదటి దశలో చంద్రయాన్‌-2 భూకక్ష్యలోనే ఉంటూ క్రమంగా తన ఎత్తును పెంచుకుంటుంది. ఇందుకోసం ఇస్రో శాస్త్రవేత్తలు దశల వారీగా అందులోని ఇంజిన్లను మండిస్తారు. ఆ తర్వాత అంకంలో అది చంద్రుడి దిశగా పయనమవుతుంది. అనంతరం చంద్రుడి కక్ష్యలోకి చేరుతుంది. ఆ తర్వాత క్రమంగా చంద్రుడి ఉపరితలానికి చేరువవుతుంది. చంద్రుడి నేల మీదకు ల్యాండర్‌, రోవర్‌లను పంపుతుంది.

ప్రయోగ సమయంలో 7 రోజుల మేర జాప్యం జరిగినప్పటికీ జాబిల్లిపై చంద్రయాన్‌-2 ల్యాండర్‌, రోవర్‌ దిగే సమయంలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. మొదట నిర్దేశించిన రీతిలో సెప్టెంబరు 7న అవి జాబిల్లిపై కాలుమోపుతాయి. ఇందుకోసం ఇస్రో తన ప్రణాళికకు భారీగా సవరణలు చేసింది. ప్రయోగంలో జాప్యం జరిగితే ల్యాండింగ్‌పై ప్రభావం లేకుండా చూసేందుకు చంద్రయాన్‌-2 ప్రయాణరీతిలో మొదటే వెసులుబాటు ఉండేలా ప్రణాళిక రచించినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రయోగం వాయిదాపడినా సాఫ్ట్‌వేర్‌లో పెద్దగా మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా చూడొచ్చని భావించారు.

- ముందుగా అనుకున్నట్లు ఈ నెల 15న ప్రయోగం జరిగినట్లయితే చంద్రయాన్‌-2.. ప్రయోగించిన తర్వాత 54వ రోజున ల్యాండర్‌, రోవర్‌లు జాబిల్లిపై కాలుమోపేవి.
- మొదటి ప్రణాళిక ప్రకారం భూకక్ష్యలో ఈ వ్యోమనౌక 17 రోజులు గడపాల్సింది. ఇప్పుడు దాన్ని 23 రోజులకు పెంచారు. పాత షెడ్యూల్‌ ప్రకారం జాబిల్లి కక్ష్యలోకి చేరే దశ 22వ రోజున జరగాల్సింది. ఇప్పుడు దాన్ని 30వ రోజుకు సవరించారు.
- జాబిల్లి కక్ష్యలో ఉండే 'లూనార్‌ బౌండ్‌ ఫేజ్‌' 28 రోజుల పాటు సాగాల్సింది. దాన్ని ఇప్పుడు 13 రోజులకు తగ్గించారు.
- సవరించిన ప్రణాళిక ప్రకారం.. ఆర్బిటర్‌ నుంచి ల్యాండర్‌ విడిపోయే అంకం 43వ రోజు జరుగుతుంది. ఆ తర్వాత 44వ రోజున ల్యాండర్‌ కిందకు దిగడం మొదలవుతుంది. 48వ రోజున ల్యాండర్‌ తనలోని థ్రాటల్‌ ఏబుల్‌ రాకెట్లను మండించడం ద్వారా వేగాన్ని బాగా కుదించుకొని, జాబిల్లి ఉపరితానికి చేరువవుతుంది. అదే రోజున చంద్రుడి దక్షిణ ధ్రువానికి చేరువలో మాంజినస్‌ సి, సింఫీయస్‌ ఎన్‌ అనే రెండు బిలాల మధ్యలో దిగుతుంది.
- సరిగ్గా అదే సమయంలో అక్కడ పగటి సమయం మొదలవుతుంది. అది 14 రోజుల పాటు సాగుతుంది. అందువల్ల సౌరశక్తిని ల్యాండర్‌, రోవర్‌లు గరిష్ఠంగా వాడుకోవడానికి వీలవుతుంది.



**మంత్రముగ్గులయ్యేలా!**
సతీశ్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై ఉన్న జీఎస్‌ఎల్‌వీ-మార్క్‌3ఎం1 వాహకనౌక చిత్రమిది. సూరత్‌లోని కళాకారులు కేవలం ముగ్గును ఉపయోగించి సోమవారం ఈ అద్భుతాన్ని ఆవిష్కరించారు



## ఎన్నాళ్లో వేచిన వేళ..!

'చంద్రయాన్‌-2' వ్యోమనౌక నింగిలోకి విజయవంతంగా దూసుకెళ్లిన వేళ యావత్‌ భారతావని పులకించింది. ఇస్రో ఘనత భారతీయులందరికీ గర్వకారణమంటూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి సహా చాలామంది ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపించారు. ఇస్రో శాస్త్రవేత్తల ఆనందానికైతే అంతే లేదు. వ్యోమనౌక నిర్దేశిత కక్ష్యలోకి చేరినట్లు సంకేతాలు అందగానే ఆనందంతో పరవశించిపోయారు. ఒకరినొకరు హత్తుకుంటూ అభినందనలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. గతంలో ఎన్నెన్నో ప్రయోగాలను అతి తక్కువ ఖర్చుతో, వేగంగా పూర్తిచేసి ప్రశంసలు అందుకున్నా.. తాజా ప్రయోగం విజయవంతమవడంపై వారిలో మునుపటితో పోలిస్తే ఎక్కువ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తమ కష్టం ఫలించే దిశగా తొలి అడుగు పడిందన్న సంతోషం వారిలో కనిపించింది. ఎందుకంటే గతంలో చేపట్టిన ప్రయోగాలతో పోలిస్తే చంద్రయాన్‌-2 అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది.

### వాయిదాలను దాటుకొని..

వాస్తవానికి 'చంద్రయాన్‌-2'ను 2013లోనే చేపట్టాలని ఇస్రో భావించింది. అందులో ఉపయోగించే ల్యాండర్‌ను రష్యా నుంచి సమకూర్చుకోవాలనుకుంది. అనుకోకుండా రష్యా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుంది. దీంతో స్వశక్తితో ప్రయోగం పూర్తిచేయాలని ఇస్రో నిర్ణయించుకుంది. ఎన్నెన్నో సవాళ్లను అధిగమిస్తూ ల్యాండర్‌ను తయారుచేసుకుంది. ఆ తర్వాత జాతీయ నిపుణుల కమిటీ సూచనలకు అనుగుణంగా మార్పులు చేయాల్సి రావడంతో ప్రయోగం వాయిదా పడింది. గతేడాది మార్చిలో, ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రయోగం చేపట్టాలనుకున్నా వివిధ కారణాలతో వాయిదాపడింది. ఇక క్రయోజెనిక్‌ దశలో లోపం తలెత్తడంతో ఈ నెల 15న మళ్లీ వాయిదా అనివార్యమైంది. ఇన్ని వాయిదాలను దాటుకొని, సవాళ్లను అధిగమించి ప్రయోగం విజయవంతమవడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఆనంద డోలికల్లో మునిగితేలారు.

### అత్యంత సంక్లిష్టం

11 ఏళ్ల క్రితం ఇస్రో 'చంద్రయాన్‌-1' ప్రయోగాన్ని చేపట్టింది. దానితో పోలిస్తే చంద్రయాన్‌-2 చాలా సంక్లిష్టమైనది. జాబిల్లిపై అత్యంత క్లిష్టమైన సాఫ్ట్‌ ల్యాండింగ్‌ను సాధించాలని ఈ ప్రయోగంలో భారత్‌ లక్ష్యంగా పెట్టుకుంది. చంద్రుడిపై సాఫ్ట్‌ ల్యాండింగ్‌ అంటే మాటలు కాదు. ఇప్పటివరకు రష్యా, అమెరికా, చైనా మాత్రమే ఆ పని చేయగలిగాయి. అందుకే చంద్రయాన్‌-2 ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సవాలుగా తీసుకున్నారు. వ్యోమనౌకను తయారుచేసి దాన్ని ఎన్నెన్నో పరీక్షలకు గురిచేశారు. చంద్రుడిపై వాతావరణాన్ని తట్టుకొని పనిచేసేలా ల్యాండర్‌, రోవర్‌ను రాటుదేల్చారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

# చిరు వ్యాపారుల పింఛనుకు శ్రీకారం

- నెలకు రూ.55 కడితే 60 ఏళ్ల తర్వాత నెలనెలా రూ.3వేలు
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ఈనాడు, దిల్లీ: చిన్న వ్యాపారుల పింఛను పథకాన్ని కేంద్ర కార్మిక శాఖ సోమవారం నుంచి ప్రారంభించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం అమలు కోసం ఎల్‌ఐసీ నేతృత్వంలో పింఛను నిధిని ఏర్పాటు చేస్తోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 3.50 లక్షల కామన్‌ సర్వీస్‌ సెంటర్లలో ఆసక్తిగలవారు పేర్లు నమోదు చేసుకోవచ్చు. రూ.1.5 కోట్లలోపు వార్షిక వ్యాపార టర్నోవర్‌ ఉన్న వ్యాపారులంతా ఇందులో చేరొచ్చు.

- వ్యాపారి చెల్లించే చందాకు సమానంగా కేంద్రం కూడా పింఛను నిధికి జమ చేస్తుంది.
- 60 ఏళ్ల నుంచి అతను జీవించి ఉన్నంత కాలం నెలకు రూ.3వేల పింఛను అందుకోవచ్చు.
- మరణానంతరం జీవిత భాగస్వామికి 50% మొత్తం చెల్లిస్తారు.

**ఎప్పుడు ఎంత కట్టాలంటే...**

- ఈ పథకంలో చేరడానికి కనిష్ఠ వయస్సు 18, గరిష్ఠ వయస్సు 40
- 18 ఏళ్లలో చేరిన వారయితే 60 ఏళ్లు వచ్చే వరకు నెలకు రూ.55 చందా చెల్లించాలి
- 20 ఏళ్లవారయితే రూ.61
- 25 ఏళ్లవారయితే రూ.80
- 30 ఏళ్ల వారయితే రూ.105
- 35 ఏళ్ల వారయితే రూ.150
- 40 ఏళ్ల వారయితే రూ.200 చొప్పున చెల్లించాలి.



- కొన్నాళ్లు చెల్లించి మధ్యలో ఆపేసిన వ్యక్తులు ఎవరైనా మళ్లీ దాన్ని కొనసాగించాలనుకుంటే పాతబకాయిలను, వడ్డీతో సహా చెల్లించి తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవచ్చు.
- ఈ పథకంలో చేరిన వారు పదేళ్లలోపు వైదొలిగితే అప్పటివరకూ చెల్లించిన మొత్తాన్ని సేవింగ్స్‌ బ్యాంక్‌ ఖాతా వడ్డీ రేటుతో తిరిగి ఇచ్చేస్తారు.
- ఒకవేళ పదేళ్ల తర్వాత వైదొలిగితే పింఛను ఫండ్‌లో పొందిన వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారు.
- నెలవారీ చెల్లింపులు చేస్తూ మధ్యలో ఎవరైనా ఆకస్మాత్తుగా చనిపోతే వారి స్థానంలో వారి జీవిత భాగస్వామి సభ్యులుగా చేరి నెలవారీ మొత్తం చెల్లిస్తూపోవచ్చు.
- అలాంటి వారికి 60 ఏళ్ల తర్వాతే పింఛను ఇస్తారు.
- జీవిత భాగస్వామి మృతిచెందిన కారణంగా దాని నుంచి వైదొలగాలని నిర్ణయించుకుంటే అప్పటి వరకూ చెల్లించిన చందామొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తారు.
- పథకంలో చేరిన తర్వాత అంగవికలురై పథకంలో కొనసాగలేకపోయిన వారికీ ఇవే నిబంధనలు వర్తిస్తాయి.
- పింఛను అందుకొనేవారు మధ్యలో చనిపోతే అతని జీవిత భాగస్వామికి నెలవారీ సగం మొత్తం మాత్రమే అందుతుంది.
- 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్యలో ఈ పథకంలో చేరిన ప్రతి ఒక్కరూ తమకు 60 ఏళ్లు వచ్చేంత వరకూ నెలవారీ చందా చెల్లిస్తూ పోయిన వారికి మాత్రమే 60 ఏళ్ల తర్వాత రూ.3వేల కుటుంబ పింఛను అందుతుంది.
- ఈ పథకంలో 'కుటుంబం' అంటే కేవలం భార్యాభర్తలు మాత్రమే వస్తారు.
- సొంతంగా వ్యాపారాలు చేస్తున్నవారు, దుకాణ యజమానులు, రిటైల్‌ వ్యాపారులు, రైస్‌మిల్లు, ఆయిల్‌ మిల్లు, వర్క్‌షాప్‌ ఓనర్లు, కమీషన్‌ ఏజెంట్లు, రియల్‌ ఎస్టేట్‌ బ్రోకర్లు, చిన్నచిన్న హోటల్‌, రెస్టారెంట్ల యజమానులు, ఇతర చిన్న వ్యాపారులు ఈ పథకం పరిధిలోకి వస్తారు.
- ఎన్‌పీఎస్‌, ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌ పరిధిలోకి వచ్చే వారికి ఇందులో చేరడానికి అర్హత ఉండదు.

# మూడేళ్లలోపు నెక్స్ట్‌ అమల్లోకి

- అన్ని కళాశాలలకు ఒకటే నీట్‌
- 50% ఫీజు నియంత్రణపై ఆందోళన

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్‌: జాతీయ వైద్యకమిషన్‌ అమల్లోకి వచ్చిన మూడేళ్లలోపు నేషనల్‌ ఎగ్జిట్‌ టెస్ట్‌ (నెక్స్ట్‌) అమల్లోకి రానుంది. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్‌ లోక్‌సభలో సోమవారం జాతీయ వైద్యకమిషన్‌ బిల్లును ప్రవేశపెట్టారు. దేశంలో వైద్యవిద్య క్రమబద్ధీకరణ కోసం భారతీయ వైద్యమండలి చట్టం స్థానంలో జాతీయ వైద్యకమిషన్‌ ఏర్పాటుకు ఈ బిల్లును ఉద్దేశించారు. కొత్త బిల్లు ప్రకారం ఎంబీబీఎస్‌, పీజీ వైద్యకళాశాలల్లో 50% సీట్లకు ఫీజులను ప్రభుత్వం నియంత్రిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఎంబీబీఎస్‌ విద్యార్థులకు చివరి సంవత్సరం నెక్స్ట్‌ ఉమ్మడిపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఉత్తీర్ణులైనవారికి వైద్యులుగా పనిచేసే లైసెన్సు, పీజీ ప్రవేశార్హత, జాతీయ, రాష్ట్ర రిజిస్టర్‌లో పేర్ల నమోదుకు అవకాశం వస్తాయి. అలాగే విదేశాల్లో వైద్యవిద్య చదివిన వారు దేశంలో వైద్యులుగా పనిచేయాలన్నా ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి. చట్టం అమల్లోకి వచ్చిన మూడేళ్లలోపు ఇది కార్యరూపంలోకి వస్తుంది. బిల్లు చట్టంగా మారిన తర్వాత వైద్యవిద్య, వైద్యవృత్తి, వైద్య విద్యాసంస్థల నియంత్రణకు కేంద్రం జాతీయ వైద్యమండలిని ఏర్పాటుచేస్తుంది. వైద్యరంగంలో 25 ఏళ్ల అనుభవం, పదేళ్లపాటు వైద్యవ్యవస్థకు నాయకత్వం వహించిన నిజాయితీపరుడైన వ్యక్తిని ఈ కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమిస్తారు. పదిమంది ఎక్స్‌ అఫీషియో సభ్యులు, 14 మంది పార్ట్‌టైమ్‌ సభ్యులతో ఇది పనిచేస్తుంది. కొత్త వైద్యకళాశాలలు, పీజీ కోర్సుల ప్రారంభం, కళాశాలల్లో సీట్లపెంపు అధికారాలన్నీ కమిషన్‌కే ఉంటాయి. వైద్యులుగా పనిచేయడానికి అర్హత సాధించినవారి పేర్లు, చిరునామాలు, విద్యార్హతలతో కూడిన జాతీయ రిజిస్టర్‌ను ఇదే నిర్వహిస్తుంది. దీనికింద నాలుగు స్వయంప్రతిపత్తి పాలకమండళ్లు ఉంటాయి. యూజీ, పీజీ వైద్యవిద్య ప్రమాణాల నిర్ధారణ కోసం వేర్వేరు వైద్యవిద్య బోర్డులు ఉంటాయి. వైద్యకళాశాలలను తనిఖీచేసి పరిస్థితులను పరీక్షించడానికి మెడికల్‌ అసెస్‌మెంట్‌ అండ్‌ రేటింగ్‌ బోర్డు ఉంటుంది. వైద్యనిపుణుల ప్రవర్తన నియంత్రణతో పాటు, వారిలో వైద్య విలువలను ప్రోత్సహించడం, లైసెన్స్‌ పొందిన మెడికల్‌ ప్రాక్టీషనర్ల పేర్లతో కూడిన జాతీయ రిజిస్టర్‌ నిర్వహణకు ఎథిక్స్‌ అండ్‌ మెడికల్‌ రిజిస్ట్రేషన్‌ బోర్డు ఏర్పాటవుతుంది. ఈ చట్టం అమల్లోకి రాగానే భారతీయ వైద్యమండలి చట్టం-1956 రద్దవుతుంది.

ఆధునిక వైద్యవృత్తితో సంబంధం ఉన్నవారు కమ్యూనిటీ హెల్త్‌ ప్రొవైడర్లుగా పనిచేసేందుకు ఈ కమిషన్‌ లైసెన్సులు ఇస్తుంది. వైద్యుల సంఖ్యలో మూడింట ఒక వంతుకు మించకుండా వీరికి లైసెన్సులిస్తారు.

### రుసుములపై జూడాల మండిపాటు

జాతీయ వైద్య కమిషన్‌ బిల్లుపై జూడాలు మండిపడుతున్నారు. ప్రైవేటు వైద్యకళాశాలల్లో 50% సీట్ల రుసుములనే ప్రభుత్వం నియంత్రిస్తుందని బిల్లులో చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 50% సీట్ల రుసుములనే ప్రభుత్వం నియంత్రిస్తే.. మిగిలిన సీట్ల రుసుములను ప్రైవేటు కళాశాలలే సొంతంగా నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించినట్లు అయిందని, తద్వారా ప్రైవేటు వైద్యకళాశాలలు ఇష్టారాజ్యంగా రుసుములు వసూలుచేసే ప్రమాదముందని వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపుడు వైద్యవిద్య మరింత ఖరీదు అవుతుందని చెబుతున్నారు.

# 'సమాచార' సవరణలకు ఆమోదం

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు

దిల్లీ: విపక్షాల విమర్శల నడుమ సమాచార హక్కు చట్టానికి చేసిన సవరణలను సోమవారం లోక్‌సభ ఆమోదించింది. సమాచార కమిషనర్లకు ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్లతో సమానమైన హోదా ఉండగా దాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం సవరణలను ప్రతిపాదించింది. వారి జీతభత్యాలు, సర్వీసు నిబంధనలను కేంద్ర ప్రభుత్వం విడిగా రూపొందించనుంది. ఈ సవరణలను ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. సమాచార కమిషన్‌ను కోరలేని పులిలా మార్చడానికే సవరణల బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించాయి. బిల్లును ప్రవేశపెట్టాలా? వద్దా? అన్నదానిపై తొలుత ఓటింగ్‌ జరగాలని పట్టుపట్టాయి. ప్రవేశపెట్టాలని 218 మంది, వద్దని 79 మంది ఓటేశారు. ప్రతిపక్షాల వాకౌట్‌ అనంతరం మూజువాణి ఓటు ద్వారా బిల్లు ఆమోదం పొందింది. సమాచార కమిషనర్ల స్వతంత్రతను హరించేందుకే ప్రభుత్వం ఈ సవరణలను తీసుకువచ్చిందని కాంగ్రెస్‌ సభ్యుడు శశిథరూర్‌ ఆరోపించారు. ప్రధాన మంత్రి విద్యార్హతలు వెల్లడించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ ఆదేశించినందువల్లనే ఇంత హడావిడిగా ఈ బిల్లు తీసుకొస్తున్నారా అని నిలదీశారు. డీఎంకే సభ్యుడు ఎ.రాజా మాట్లాడుతూ ఈ సవరణలతో సమాచార కమిషనర్లు ప్రభుత్వానికి ఇంటి పనిమనుషులుగా మారనున్నారని విమర్శించారు. ప్రధాని కార్యాలయం సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌ సమాధానమిస్తూ సవరణలపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాయన్నారు.




### క్రూరంగా ఉండొద్దు: జయదేవ్‌

ఈనాడు, దిల్లీ: "రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం పార్లమెంటు స్థాయీసంఘం పరిశీలన లేకుండా 11 బిల్లులు పాస్‌చేసుకుంది. భారీ మెజార్టీ ఉన్నంత మాత్రాన క్రూరంగా వ్యవహరించమని అర్థం కాదు" అని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత గల్లా జయదేవ్‌ కేంద్రానికి సూచించారు. ఆర్‌టీఐ చట్టసవరణ బిల్లుపై సోమవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సవరణలను తాము వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో సీవీసీ, లోక్‌పాల్‌ చట్టాలకూ సవరణలు చేసి వాటినీ అధీనంలో ఉంచుకొనే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఆర్‌టీఐ చట్టంలో 'రికార్డ్‌' అన్న పదానికి అర్థం చెప్పారు తప్ప రహస్యరికార్డు అని ఎక్కడా లేదని, కానీ ప్రజలు వివరాలు అడిగినప్పుడు రహస్య రికార్డు పేరుచెప్పి సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని వివరించారు. అందువల్ల ఏది రహస్యం, ఏది రహస్యం కాదో వివరణ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకొని స్థాయీసంఘానికి పంపాలని డిమాండ్‌ చేశారు. గల్లా జయదేవ్‌ ప్రసంగం పట్ల మంత్రి జితేంద్రసింగ్‌ ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగు నెలల క్రితం తాము ఇలాంటి బిల్లు తెచ్చి ఉంటే ఆయన సమర్థిస్తూ మాట్లాడి ఉండేవారని, అదెందుకో అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు.

### బిల్లును వ్యతిరేకించండి: శ్రీధర్‌ ఆచార్యులు

సమాచార కమిషన్‌ను వెన్నెముక లేని సంస్థగా మార్చే ఈ బిల్లును రాజ్యసభలో వ్యతిరేకించాలని కేంద్ర సమాచార కమిషన్‌ మాజీ కమిషనర్‌ శ్రీధర్‌ ఆచార్యులు ఎంపీలను కోరారు. ఈ సవరణలకు ఆమోదం తెలిపితే సమాచార కమిషన్‌ స్వతంత్రతను కోల్పోతుందన్నారు.

# హర్‌ ఘర్‌ జల్‌ భారం సగం రాష్ట్రాలదే



- 50% నిధులనే ఇవ్వనున్న కేంద్రం
- ఇతర పథకాల సొమ్మూ మళ్లింపు

ఈనాడు, దిల్లీ: ప్రతి ఇంటికీ 2024 నాటికి మంచినీటిని అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'హర్‌ ఘర్‌ జల్‌' పథకానికి రాష్ట్ర ప్రభుత్వాలు సగం నిధులను సమకూర్చనున్నాయి. ఈ పథకం అమలుకు రానున్న అయిదేళ్లలో రూ.3,60,000 కోట్లు ఖర్చు కానుండగా, అందులో సగం అంటే రూ.1,80,000 కోట్లను రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తి మేరకు నిధులు సమకూర్చుతాయని కేంద్ర జల్‌ శక్తి మంత్రివర్గ అధికారులు తెలిపారు. 8 ఈశాన్య రాష్ట్రాలు, 3 హిమాలయ రాష్ట్రాలు (ఉత్తరాఖండ్‌, హిమాచల్‌, జమ్ము-కశ్మీర్‌)లకు మాత్రం ఇందుకు మినహాయింపు ఉంది. ఆ రాష్ట్రాల్లో 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం నిధులు ఇస్తే సరిపోతుంది.

### ఉపాధి నిధులు మళ్లించవచ్చు..

ఉపాధి హామీ పథకం కింద మంజూరయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నూతన పథకానికి మళ్లించే వెసులుబాటు కల్పించనుంది. 256 జిల్లాల్లో నీటి వనరులకు తీవ్రమైన కొరత ఉన్న నేపథ్యంలో ఈ నిధులను మళ్లించేందుకు కేంద్రం అనుమతి ఇవ్వనుంది. వివిధ అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు అడవులకు నష్టం కలిగితే ప్రత్యామ్నాయంగా అడవులు పెంచడానికి ప్రత్యేకంగా నిధులు ఉన్నాయి. ప్రత్యామ్నాయ అటవీ పెంపక యాజమాన్యం, ప్రణాళిక ప్రాధికార సంస్థ (కాంపెన్సేటరీ అఫారెస్టేషన్‌ మేనేజ్‌మెంట్‌ అండ్‌ ప్లానింగ్‌ అథారిటీ-కాంపా) నిధి పేరుతో ఈ సొమ్ము ఉంది. అడవులు, వన్యమృగాలను సంరక్షించడం కోసం ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉందని తొలుత నిర్ణయించారు. అయితే 2009 నుంచి ఈ నిధులు నిరుపయోగంగా ఉన్నందున వీటిని పర్యావరణ పరిరక్షణ, జలవనరుల కోసం మళ్లించేందుకు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. ఇందుకు గత జనవరిలో సుప్రీంకోర్టు అనుమతించడంతో అందులోని రూ.54వేల కోట్లు ఈ పథకానికి మళ్లించే అవకాశం ఉంది. ఇందులో 90 శాతం నిధులను రాష్ట్రాలకు ఇచ్చే వీలుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదం కోసం జల్‌శక్తి శాఖ కేంద్ర మంత్రివర్గం ముందు ఉంచనుంది.

## నెహ్రూను గుర్తుచేసుకోవడానికి ఇదే సరైన సమయం: కాంగ్రెస్

### చంద్రయాన్‌-2 ప్రాజెక్టుకు మన్మోహన్‌ పచ్చజెండా

దిల్లీ: చంద్రయాన్‌-2 విజయవంతం కావడం పట్ల కాంగ్రెస్‌ పార్టీ సోమవారం హర్షం వ్యక్తం చేస్తూ... కాంగ్రెస్‌ గత నాయకత్వ చొరవే దీనికి కారణమని చెప్పేందుకు ప్రయత్నించింది. "ఇస్రోకు అభినందనలు. ఇద్దరు ప్రధానుల దార్శనికతను మననం చేసుకోవడానికి ఇదే సరైన సమయం. 1962లో ఇన్కోస్పార్‌ ద్వారా అంతరిక్ష పరిశోధనలు చేపట్టేందుకు నాటి ప్రధాని జవహర్‌లాల్‌ నెహ్రూ నిధులను సమకూర్చారు. తర్వాత అది ఇస్రోగా రూపాంతరం చెందింది. చంద్రయాన్‌-2 ప్రాజెక్టుకు 2008లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ పచ్చజెండా ఊపారు" అని కాంగ్రెస్‌ పార్టీ ట్విట్టర్‌లో పేర్కొంది. దీనికి భాజపా అధికార ప్రతినిధి సంబిత్‌ పాత్ర స్పందిస్తూ... భావి నాయకత్వం లేనప్పుడు గత నాయకులను గుర్తుచేసుకోక ఏం చేస్తారని వ్యాఖ్యానించారు.

## యూపీలో 'ముందస్తు బెయిల్‌' పునరుద్ధరణ

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ నిందితులకు ఇకపై ముందస్తు బెయిల్‌ లభించనుంది. ఈ నిబంధనను అత్యవసర పరిస్థితి సందర్భంగా 1976లో ఎత్తివేయగా, నాలుగు దశాబ్దాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దాన్ని పునరుద్ధరించింది. అన్ని రాష్ట్రాల్లోనూ నిందితులకు ముందస్తు బెయిల్‌ కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండగా, ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌, ఉత్తరాఖండ్‌ల్లోనే ఆ సౌకర్యం లేదు. తాజా నిర్ణయంతో ఆ లోటు తీరినట్టయింది. ఇందుకోసం శిక్షా స్మృతి (సీఆర్‌పీసీ)లోని 438వ సెక్షన్‌ను సవరించింది.

## ఎన్డీఏ-2 ప్రగతి నివేదిక విడుదల

దిల్లీ: సబ్‌కా సాథ్‌, సబ్‌కా వికాస్‌, సబ్‌కా విశ్వాస్‌ (అందరితో కలిసి, అందరి అభివృద్ధి, అందరి విశ్వాసం) సాధించటమే లక్ష్యంగా దేశ ఆర్థికవ్యవస్థ పురోగతికి చరిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. సత్వరాభివృద్ధి దిశగా సంస్కరణల పరుగు ప్రారంభమైందని, ఎన్డీఏ-1 ప్రభుత్వంలో కన్నా ఎన్డీఏ-2 సర్కారు హయాంలో ఇది మరింత వేగంగా జరుగుతోందని తెలిపింది. నరేంద్రమోదీ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చి 50 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం ప్రగతి నివేదికను ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలును ఇప్పటికే ప్రారంభించామంటూ ప్రగతి నివేదికలోని విశేషాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి ప్రకాశ్‌ జావడేకర్‌ వివరించారు. రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి రూ.6వేల జమ, పంటల మద్దతు ధరల పెంపు, పదివేల రైతు ఉత్పాదక సంస్థల ఏర్పాటు, మధ్యతరగతి వారికి పన్నుల లబ్ధి, ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.70వేల కోట్ల మూలధనం, విధుల నిర్వహణలో ప్రాణాలర్పించిన సైనికులు, పోలీసు సిబ్బంది పిల్లలకు ఉపకారవేతనాలు, ఆర్థిక నేరగాళ్లపై కఠిన చర్యలు, వైద్య విద్యలో సంస్కరణలు, తదితరాలను ప్రగతి నివేదికలో ప్రస్తావించారు.

## కనీసం ఒక ఆడపిల్ల కూడా జన్మించలేదు

ఉత్తరకాశీ: గత ఆరునెలల్లో ఉత్తరకాశీ జిల్లాలోని 16 గ్రామాల్లో 65 మంది పిల్లలు పుడితే వారిలో కనీసం ఒక్క ఆడపిల్లయినా లేదు. ఆయా ప్రాంతాల్లోని వైద్యపరీక్షా కేంద్రాల్లో చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు, గర్భస్రావాలు జరుగుతున్నాయేమోననీ, కనీసం ఒక్క ఆడపిల్ల కూడా జన్మించకపోవడానికి కారణం అదే కావచ్చన్న అనుమానాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై కూలంకష దర్యాప్తునకు ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్‌ రావత్‌ ఆదేశించారు. ఇది అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన పరిస్థితి అని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి రేఖా ఆర్య పేర్కొన్నారు. ఉత్తరకాశీ జిల్లాలోని మరో 66 గ్రామాల్లో కూడా మగపిల్లలతో పోలిస్తే ఆడపిల్లల సంఖ్యే తక్కువగా ఉందని జిల్లా కలెక్టరు ఆశిష్‌ చౌహాన్‌ తెలిపారు. కల్పనా ఠాకూర్‌ అనే సామాజిక కార్యకర్త మాట్లాడుతూ.... ఈ పరిణామాన్ని యథాలాపంగా తీసుకోరాదని, ఇందుకు భ్రూణహత్యలే కారణం కావచ్చని అనుమానాన్ని వ్యక్తం చేశారు.

## మానవహక్కుల బిల్లుకు ఆమోదం

దిల్లీ: జాతీయ, వివిధ రాష్ట్రాల మానవహక్కుల కమిషన్లలో చైర్‌పర్సన్లు, సభ్యుల నియామక ప్రక్రియను వేగవంతం చేసే బిల్లును పార్లమెంటు సోమవారం ఆమోదించింది. ఈ నియామకాలలో ప్రభుత్వజోక్యం ఉంటుందన్న ప్రతిపక్షాల అనుమానాలను కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా తీర్చారు. ఖాళీలను భర్తీ చేయడానికి వీలుగా వయోపరిమితిని తగ్గించినట్లు రాజ్యసభలో జరిగిన చర్చలో షా చెప్పారు. లోక్‌సభ శుక్రవారమే ఆమోదించిన మానవహక్కుల పరిరక్షణ (సవరణ) బిల్లును రాజ్యసభ సోమవారం ఆమోదించింది. ప్రస్తుతం చైర్‌పర్సన్ల పదవీకాలం అయిదేళ్లుగా ఉండగా, దీన్ని మూడేళ్లకు తగ్గించారు. ప్రస్తుతం జాతీయ మానవహక్కుల కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి మాత్రమే చైర్‌పర్సన్‌గా ఉండేందుకు అర్హులు కాగా, సవరణ అనంతరం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కూడా అందుకు అర్హులే.

### సమావేశాల పొడిగింపు వద్దు: విపక్షాలు

పార్లమెంటు సమావేశాలను పొడిగించాలన్న ప్రతిపాదనకు తాము సుముఖంగాలేమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. సోమవారం లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన సభా వ్యవహారాల సంప్రదింపుల కమిటీ భేటీలో ఈ విషయాన్ని చెప్పాయి. ముఖ్యమైన బిల్లుల ఆమోదం కోసం సమావేశాలను పొడిగించాలని భావిస్తున్నట్లు మంత్రులు చెప్పారు. సమావేశాలు ఈ నెల 26న ముగియనుండగా, మరో మూడు రోజులపాటు పొడిగిస్తూ స్పీకర్‌ మంగళవారం నిర్ణయం తీసుకునే అవకాశముంది.

